ఈనాడు
పశ్చిమగోదావరి

మంగళవారం అక్టోబరు 22, 2024 5





అమరులకు వందనం

పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని భీమవరం మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం నిర్వహించారు. కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, శాసన మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు తదితరులు పాల్గొన్నారు. -6లో

విద్యుత్తు శాఖలో బదిలీలు

పలువురు ఈఈలు, ఏడీఈలకు స్థానచలనం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యుత్తు శాఖలో బదిలీలు జరిగాయి. పలువురు ఈఈలు, ఏడీఈలను బదిలీ చేస్తూ సోమవారం సాయంత్రం ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏఈలను పరిశీలిస్తే.. నరసాపురంలో పని చేస్తున్న బి.సురేష్ కుమార్‌ను విశాఖ కార్పొరేట్ కార్యాలయానికి, అక్కడ పనిచేస్తున్న పీవీవీ సత్యనారాయణను ఏలూరు డీపీఈ విభాగానికి బదిలీ చేశారు. ఏలూరు సాంకేతిక విభాగంలో పని చేస్తున్న పీర్ అహ్మద్ ఖాన్‌ను తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెంలో పని చేస్తున్న పి.రాధాకృష్ణను ఏలూరు టెక్నికల్ విభాగానికి బదిలీ చేశారు.



అవును.. అది చిరుతే

భీమడోలు పరిసరాల్లో సంచారం



బోను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

భీమడోలు, ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: భీమడోలు పరిసరాల్లో సంచరిస్తున్న జంతువు చిరుతపులి అని నిర్ధారణ అయింది. అటవీ శాఖాధికారులు భీమడోలు శివారు ద్వారకా తిరుమల మండల పరిధిలోకి వచ్చే అందనాలమ్మ చెరువు పరిసరాల్లో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో చిరుత స్పష్టంగా కనిపించింది. దీంతో అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. భీమడోలు సీఐ యు.జె.విల్సన్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భీమడోలు మండలం అంబరుపేట, పోలసానిపల్లి, ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి, అందనాలమ్మ చెరువు, కాట్రగడ్డ కల్యాణ మండపం పరిసరాల్లో ఒంటరిగా తిరగవద్దని హెచ్చరిస్తూ సోమవారం టాంటాం వేయించారు. డీఎఫ్‌వో ఆశాకిరణ్ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేశారు.

పోలీసు శాఖకు 13 ఫిర్యాదులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మీకోసం కార్యక్రమంలో అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. భీమవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో 13 ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. వీటి పరిష్కరించేలా సంబంధిత స్టేషన్ల అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

రైతేరాజు

మిశ్రమ సేద్యం.. లాభయోగ్యం..!

వనామీ సాగులో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి 6 లో



రక్తపోటు.. చక్కెర కాటు

తాడేపల్లిగూడేనికి చెందిన హిమబిందు వయసు 37. ఆమెకు ఇటీవల విపరీతమైన తలపోటు, కళ్లు తిరగడంతో చికిత్సకు ఆస్పత్రికి వెళ్తే రక్తపోటు ఉందని నిర్ధారణ అయింది.

భీమవరం పట్టణానికి చెందిన రమేశ్ ప్రైవేటు ఉద్యోగి. వయసు 47. ఆయన ఇటీవల అస్వస్థతకు గురవ్వడంతో ఆస్పత్రికి వెళ్లగా మధుమేహం ఉందని వైద్యులు నిర్ధారించారు.

భీమవరానికి చెందిన 35 ఏళ్ల ఓ యువకుడు ఇటీవల గుండె పోటుతో మృతి చెందారు.

ఈనాడు డిజిటల్, భీమవరం, తాడేపల్లిగూడెం

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ఉరుకులు పరుగుల జీవితంలో మారిన జీవన విధానం అనారోగ్యానికి చేరువ చేస్తోంది. 40వ పడిలోకి వచ్చేసరికే రక్తపోటు, మధుమేహం వంటి రుగ్మతలతో బాధ పడేవారి సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో 40 ఏళ్లు దాటిన ప్రతి వంద మందిలో 22 మంది రక్తపోటు, 18 మంది మధుమేహంతో బాధ పడుతున్నారని వైద్య నిపుణుల అంచనా. హృద్రోగ సమస్యలు, క్యాన్సర్ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. గ్యాస్ట్రిక్, కిడ్నీ ఇతర సమస్యలతో ఎక్కువగా సతమతం అవుతున్నారు. మహిళలు వివిధ రకాల గైనిక్ సమస్యలకు గురవుతున్నారు. అసంక్రమిక వ్యాధుల నిర్ధారణ (ఎన్‌సీడీ) ప్రాజెక్టు పథకంలో భాగంగా ఏటా ప్రజలకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారు. ✦ జిల్లాలో 40ఏళ్లు దాటిన వారిలో వ్యాధుల ముప్పు అధికంగా ఉంటోంది. ఒత్తిడితో నిద్ర సరిగా లేకపోవడంతో

ఒత్తిడితో చిత్తవుతున్న ఆరోగ్యం

పాటు ఆందోళనకు గురవుతున్నారు. జంక్ ఫుడ్‌కు అలవాటు పడటంతో శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

మహిళలే అధికం



చాలా మంది మహిళలు ఉదయం అల్పాహారం తీసుకోవడం లేదు. దీంతో గ్యాస్ట్రిక్, హార్మోన్ల అసమతుల్యత, మధుమేహం వంటి రుగ్మతలు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. 16-30 ఏళ్ల వయసులో ఉన్నవారు సరిగా తినకపోవడం వల్లే ఊబకాయం, అండాశయంలో నీటి బుడగలు, థైరాయిడ్ వంటి సమస్యలతో సతమతమవుతున్నారు.

30–45 ఏళ్ల మధ్య ఉన్నవారికి వైద్య పరీక్షలు చేయగా...

ఎన్‌సీడీ (అసంక్రమిక వ్యాధులు) గణాంకాల ప్రకారం..

- వైద్య పరీక్షలు చేసింది: 9,56,178
- మధుమేహంతో బాధ పడుతున్నవారు 27,603
- రక్తపోటు ఉన్నవారు 56,292
- మధుమేహం, రక్తపోటు రెండింటితో బాధ పడుతున్న వారు 44,997
- వివిధ రకాల కేన్సర్లతో ఇబ్బంది పడుతున్నవారు 3,564

"యోగా చేయడం, ఆహార నియమాలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. నూనె పదార్థాలు, మసాలా, కారం, ఉప్పు వినియోగం తగ్గించాలి. ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. కనీసం ఆరు గంటలు నిద్రపోవాలి." అని డీపీఎంవో ధనలక్ష్మి తెలిపారు.

స్వాధీనాల్లో స్వాహాపర్వం

- విస్మయం కలిగిస్తున్న కొందరు పోలీసుల తీరు
- పట్టుబడిన సొత్తు దారి మళ్లిస్తూ మాయ
- పోయిందానికి ఇచ్చేదానికి పొంతన లేని వైనం

☛ ఆగస్టులో జంగారెడ్డిగూడెంలోని ఓ ఇంట్లో 7 కాసుల బంగారం చోరీ జరగగా ఇటీవల పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. రికవరీ సైతం చూపించారు. బాధితుడికి మాత్రం బంగారం ఇవ్వలేదు. ఇదేమిటని అడిగితే అది గతంలో జరిగిన చోరీ అంటూ బుకాయించారు. బాధితుడికి ఉన్న పరిచయాలతో స్వాధీనం చేసుకున్న ఆభరణాల చిత్రాలు సంపాదించారు. చూస్తే అది అతని బంగారమే అని తెలిసింది.

☛ కొంతకాలం క్రితం పెనుమంట్ర మండలంలో వరుస చోరీలు జరిగాయి. చాగల్లుకు చెందిన అప్పటి పోలీస్ అధికారి తమ పరిధిలో జరిగిన చోరీల పరిశోధనలో పెనుమంట్ర దొంగలు దొరికారు. వారి నుంచి 39 కాసులు బంగారం స్వాధీనం చేసుకున్నారు. పెనుమంట్ర పోలీసులకు అప్పగించకుండా మొత్తం స్వాహా చేశారు.



ఈనాడు, ఏలూరు, భీమవరం: ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసుల్లో కొందరు భక్షకుల అవతారమెత్తుతున్నారు. నిలువు దోపిడీతో సర్వం కోల్పోయిన వారికి బాసటగా నిలవాల్సింది పోయి..దోపిడీకి దిగుతున్నారు. చేస్తున్న అరకొర స్వాధీనాల్లో సైతం చేతివాటం చూపిస్తున్నారు.

అప్పగింతల్లో అవకతవకలు

ఉభయ జిల్లాల్లోని కొందరు పోలీసులు పలు నేరాల్లో బాధితులై ఆర్థికంగా చితికిపోయిన వారిని సైతం రాబందుల్లా పీక్కుతింటున్నారు. చేస్తున్న అరకొర స్వాధీనాల్లో కాసుల వేట సాగిస్తున్నారు. వారు పట్టుకున్న బంగారానికి, బాధితులకు అప్పగిస్తున్న సొత్తుకు పరిమాణంలో, నాణ్యతలో భారీగా వ్యత్యాసం ఉంటోంది. రెండు నెలల క్రితం ఏలూరులో వేణుగోపాల స్వామి ఆలయం, రామకోటి, దక్షిణపువీధి తదితర ప్రాంతాల్లో బంగారు గొలుసుల చోరీలు జరిగాయి. వాటిని గణపవరం పోలీసులు పట్టుకున్నారు.

అన్నింటా ఇదే అంతు

దాదాపు 90 శాతం కేసుల్లో బాధితులు.. మిగిలిన సొత్తు గురించి అడిగితే దొంగలు చిల్లరగా అమ్ముకున్నారని అందుకే దొరకలేదని కథ ముగిస్తున్నారు. నాణ్యత విషయంలోనూ రాగి కలిపిన బంగారం ముట్టజెబుతున్నారన్న విమర్శలున్నాయి. జూదాలు, కోడిపందేల సమయంలో పట్టుకున్న మొత్తాన్ని కూడా కొందరు పోలీసులు దారి మళ్లిస్తున్నారు. సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాల విషయంలోనూ చేతివాటం ఉంటోంది. దీనిపై ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ రికవరీల విషయంలో పోలీసుల తీరుపై పరిశీలిస్తామన్నారు. సమీక్షించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రణాళిక ప్రకారం దోపిడీ

బాధితులు ఇచ్చే ఫిర్యాదులో ఆభరణాలు, వస్తువులు మాత్రమే పోయినట్లు రాయాలని, నగదు ప్రస్తావన వద్దంటూ పోలీసులు ఆంక్షలు పెడుతున్నారు. ఇటీవల ఏలూరు, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో జరిగిన దొంగతనాల్లో దాదాపు రూ. 10 లక్షల వరకు చోరీ కాగా ఒక్క ఫిర్యాదులో కూడా నగదు ప్రస్తావన లేకుండా కథ నడిపించారు. దీంతో దొంగలు దొరికినప్పుడు స్వాధీనం చేసుకున్న నగదు మొత్తం స్వాహా చేస్తున్నారు.



జడ్పీ సీఈవోకు దరఖాస్తు అందిస్తున్న జడ్పీటీసీ సభ్యులు

రసవత్తరంగా జడ్పీ రాజకీయాలు!

ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని వినతి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ప్రస్తుతం ఉమ్మడి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఘంటా పద్మశ్రీ కొనసాగుతున్నారు. ఆమె ఇటీవల వైకాపాకు రాజీనామా చేసి తెదేపాలో చేరారు. అప్పటినుంచి వైకాపాకు చెందిన జడ్పీటీసీ సభ్యులు ఆమెను లక్ష్యంగా చేసుకున్నారు. ఆమెను ఎలాగైనా ఛైర్‌పర్సన్ పదవి నుంచి దించేయాలని యత్నాలు చేస్తున్నారు. అది సాధ్యం కానందున ఉమ్మడి జిల్లాలోని 31 మంది జడ్పీటీసీ సభ్యులు సోమవారం ఏలూరులోని జడ్పీ అతిథి గృహంలో సమావేశమయ్యారు. అంతర్గతంగా చర్చించుకున్నారు. అక్కడి నుంచి నేరుగా జడ్పీ ఛైర్‌పర్సన్‌ను కలవడానికి ఆమె క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఆమె అందుబాటులో లేకపోవడంతో ఆమె భర్త ప్రసాద్‌ను కలిశారు. ముందుగా సమాచారం ఇస్తే బాగుండేదని, ఛైర్‌పర్సన్ పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్లారని తెలిపారు. అక్కడి నుంచి జడ్పీటీసీ సభ్యులు బయటకు వచ్చి మరోసారి సమావేశం నిర్వహించుకున్నారు. అనంతరం జడ్పీ కార్యాలయంలోని సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావును కలిశారు. జడ్పీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయించాలని.. ఒక పార్టీపై గెలిచి, మరో పార్టీలోకి వెళ్లిన పద్మశ్రీని ఆ పదవి నుంచి తప్పించాలని కోరుతూ 31 మంది సంతకాలతో కూడిన దరఖాస్తు అందజేశారు. అనంతరం జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ పద్మశ్రీ వైకాపా గుర్తుపై జడ్పీటీసీ సభ్యురాలుగా ఎన్నికయ్యారని, తామందరం ఆమెను జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నామని తెలిపారు. పార్టీ మారిన ఆమెను పదవి నుంచి తప్పించాలని, అందుకు సంబంధించి మూడు రోజుల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయాలని సీఈవోకు దరఖాస్తు అందించామన్నారు. జడ్పీ సీఈవో మాట్లాడుతూ జడ్పీటీసీ సభ్యులు తనను కలిసి దరఖాస్తు అందజేశారని, వారి విన్నపాన్ని ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

33 రోజులు.. రూ.3.03 కోట్ల కానుకలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో లభించింది. స్థానిక దేవస్థానం కల్యాణ మండపంలో ఆలయాధికారులు సోమవారం హుండీలు తెరిచి నగదు లెక్కించారు. గడిచిన 33 రోజులకు రూ. 3,03,89,678 నగదు, 597 గ్రాముల బంగారం, 8.244 కిలోల వెండి లభించినట్లు ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.



యువతా.. నైపుణ్య ప్రాప్తిరస్తు 6 లో గోతులా.. బావులా..?



శేషవాహన సేవ



చందన స్వరూపుడు వేంకటేశ్వరుడు



కేరళ కళాకారుల వాయిద్యం

బ్రహ్మోత్సవం.. భక్తజన సంబరం

వేడుకగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: గోవింద నామ స్మరణలు మిన్నంటిన వేళ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. పండితుడు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో అంకురార్పణ చేశారు. శుభముహూర్తంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గరుడ పటాన్ని ఊరేగించి బ్రహ్మాది దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తూ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి సమక్షంలో ఎగురవేశారు. అనంతరం మూలమూర్తికి ఎమ్మెల్యే సత్యానందరావు, ఈవో సూర్యచక్రధరరావు, కనకదుర్గాదేవి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. తొలివాహనమైన ఏడుపడగల ఆదిశేషునిపై రాత్రి ఉభయ దేవేరులతో పరావాసుదేవ అలంకారంలో మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయ ప్రదానం చేశారు. మంగళవారం అష్టదళ పాదపద్మారాధన, సరస్వతి అలంకరణలో హంసవాహన సేవ జరగనుంది.



నరసాపురం ప్రధాన రహదారిపై ప్రవాహం

నరసాపురంలో కుండపోత

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం, మొగల్తూరు తదితర గ్రామాల్లో సోమవారం వర్షం కుండపోతగా కురిసింది. సుమారు గంటన్నర సమయం ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు వీలు లేకుండా పోయింది. పట్టణం, గ్రామాల్లో డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. మొగల్తూరు పెన్మత్స రంగరాజు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచింది.

అర్జీలకు సత్వర పరిష్కారం: కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)లో వస్తున్న అర్జీలను సత్వరం పరిష్కరించేలా దృష్టి సారించాలని కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులనుద్దేశించి మాట్లాడారు. 179 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. డీఆర్వో ఉదయభాస్కరరావు, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా అధికారి దోసిరెడ్డి, కేఆర్‌సీసీ ప్రత్యేక ఉపకలెక్టర్ శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ✦ భీమవరం మండలం బేతపూడి పంచాయతీ పరిధిలోని కొత్రపాడు రక్షిత నీటి చెరువులో చేపల పెంపకానికి పశువుల పేగులు, కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారంటూ స్థానికుడు సాగర్‌బాబు ఫిర్యాదు చేశారు. ✦ విశ్రాంత సైనిక ఉద్యోగుల కోటాలో తన తండ్రికి కలవపూడిలో ఇచ్చిన అయిదెకరాల భూమికి పట్టా ఇప్పించాలని కాళ్ల మండలం ఎస్సీబోస్ కాలనీకి చెందిన లాజరు అర్జీ అందజేశారు. ✦ పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రభుత్వ ఆదేశాలను లెక్క చేయకుండా సెలవు దినాల్లో, రాత్రి వేళ తరగతులు నిర్వహిస్తున్నారంటూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు ప్రతినిధులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పట్టాదారు పుస్తకం ఉంటేనే ఓటు

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన జారీ

ఉండి, న్యూస్‌టుడే: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి సోమవారం ప్రకటన జారీ చేశారు. జిల్లాలోని 20 మండలాల్లో మేజర్ ఇరిగేషన్ పరిధిలో 98, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 14 సంఘాలకు నవంబరులో ఎన్నికలు జరగనున్నాయి. తహసీల్దార్లను ఎన్నికల అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కాలువ పేరు	సంఘాలు	ఆయకట్టు (ఎకరాల్లో)	ప్రాంతాల సంఖ్య
ఏలూరు	01	3,229	01
జంక్షన్	05	16,919	42
వీఅండ్‌డబ్ల్యూ	09	38,364	55
పాత వయ్యేరు	02	8,083	10
ఉండి	21	81,488	134
అత్తిలి	11	45,280	84
జీఅండ్‌వీ	17	68,369	102
కాకరపర్రు	02	11,597	25
నరసాపురం	20	91,318	166
బ్యాంక్ కెనాల్	10	41,482	77

ఆయకట్ల వారీగా

ఆయకట్లలో సర్వే నంబర్ల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. 25 సెంట్లకు పైగా సాగుభూమితో పాటు పట్టాదారు పాసుపుస్తకం ఉన్న వారికి ఈ ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నవంబరు 21-23 తేదీల మధ్య అన్ని సంఘాల్లో సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. 24-26 తేదీల మధ్య నీటి పంపిణీ సంఘాలు (డీసీ)లు, 27-29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీ (పీసీ) ఎన్నికలు జరుగుతాయి.

● జిల్లా వ్యాప్తంగా 4,11,332 ఎకరాల ఆయకట్టు ఉందని అధికారులు తేల్చారు. దీనిలో అత్యధిక విస్తీర్ణంలో వరి సాగవుతోంది. తర్వాత స్థానంలో చేపలు, రొయ్యల చెరువులు, కొబ్బరి, ఉద్యాన తోటలు ఉన్నాయి. ప్రధాన కాలువల వారీగా సంఘాలు, ఆయకట్టు వివరాలు ఇలా ఉన్నాయి.

మృత్యు ప్రయాణం

- వేడుక వేళ విషాదం
- ఆర్టీసీ బస్సు ఢీకొని దంపతుల దుర్మరణం

తణుకు గ్రామీణం, నిడదవోలు, న్యూస్‌టుడే : బంధువుల ఇంట్లో జరిగే ఊయల వేడుకకు ద్విచక్ర వాహనంపై బయలుదేరిన దంపతులను మార్గంమధ్యలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. సమిశ్రగూడెం ఎస్సై వీరబాబు తెలిపిన వివరాలు.. తణుకు మండలం పైడిపర్రుకు చెందిన బెల్లంకొండ వెంకటేశ్వరరావు(60) భార్య దుర్గ(50)తో కలిసి తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం మద్దూరులో బంధువుల ఇంట జరుగుతున్న వేడుకకు సోమవారం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. నిడదవోలు మండలం గోపవరం కాటా సెంటర్‌కు వచ్చేసరికి రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం (వయా నిడదవోలు) వెళుతున్న నిడదవోలు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో వారు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. వీరికి కుమారుడు పద్మారావు, కుమార్తె లక్ష్మి ఉన్నారు. ఇద్దరికీ వివాహాలయ్యాయి.



వెంకటేశ్వరరావు, దుర్గ (పాత చిత్రం)

రాక కోసం ఎదురు చూస్తుంటే.. వెంకటేశ్వరరావు, దుర్గ డి.ముప్పవరం వరకు వచ్చేశారని, మరో పది నిమిషాల్లో వేడుక వద్దకు చేరుకుంటారని సమాచారం అందడంతో బంధువులు ఆశగా ఎదురు చూస్తుండగా ప్రమాద సమాచారం తెలియడంతో విషాదంలో మునిగిపోయారు. వెంకటేశ్వరరావు బంటా మేస్త్రీగా పని చేస్తున్నాడు. రోజువారీ కూలి పనులకు కూలీలను తీసుకెళ్తుంటారు. దుర్గ గృహిణి. అమ్మా, నాన్న లేవండి అంటూ మృతదేహాలు ఉన్న అంబులెన్స్ అద్దాల బయట నుంచి చూస్తూ వారి పిల్లలు గొంతెత్తి పిలవడం ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది.


చితిపై వర్షపు నీరు పడకుండా పరదా పట్టుకున్న యువకులు

ఆగని వాన.. అంతిమ వేదన

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఆఖరు మజిలీ సైతం ప్రశాంతంగా పూర్తిచేసే వనరులు గ్రామీణ ప్రాంతాల్లో కరవయ్యాయి. ఎడతెరపి లేని వర్షాల్లో ఎవరైనా మృతిచెందితే అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి గ్రామీణ శ్మశాన వాటికల్లో పడుతున్న ఇబ్బందులకు అద్దం పడుతున్న చిత్రమిది. పేరుపాలెంనార్తు కటికిలవారి మెరకకు చెందిన కటికిల సుశీల(80) వృద్ధాప్య సమస్యలతో సోమవారం మృతిచెందారు. శ్మశాన వాటికకు వెళ్లే దారి సరిగా లేకపోవడంతో అంతిమ యాత్రకు ఆ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. శ్మశానవాటికలో షెడ్డు, ఇతర నిర్మాణాలేవీ లేవు. ఆ వృద్ధురాలి భౌతిక కాయానికి అంతిమ సంస్కారం జరుగుతుండగా భారీ వర్షం కురిసింది. దీంతో చితిపై వర్షంనీరు పడకుండా నాలుగువైపులా నలుగురు యువకులు నిలబడి పరదా అడ్డుగా పట్టుకుని పూర్తిచేశారు. గత ప్రభుత్వ పాలనలో శ్మశానవాటికలు, వాటి దారుల అభివృద్ధికి చర్యలు శూన్యం.

యువతా.. నైపుణ్య ప్రాప్తిరస్తు!

● పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తులు ● ఈ నెల 25వరకు అవకాశం

పాలకొల్లు, న్యూస్‌టుడే

✦ నరసాపురానికి చెందిన అవినాష్ డిగ్రీ పూర్తిచేశాడు. ఇటీవల ఒక ఇంటర్వ్యూకు హాజరవ్వగా ఏయే అంశాల్లో ప్రావీణ్యం ఉందని, ఏరంగంలో నైపుణ్యం ఉందని ప్రశ్నిస్తే సమాధానం కరువయ్యింది. ఉద్యోగాల వేటలో నేడు కేవలం చదువు ఒక్కటే సరిపోదని అంతిమంగా అవినాష్‌కు అర్థమయ్యింది. ఇటువంటి యువత కోసమే కేంద్రం పీఎం ఇంటర్న్‌షిప్‌ను తీసుకొచ్చింది. ప్రముఖ సంస్థల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా నైపుణ్యం పెంపొందించడానికి ప్రస్తుతం అంతర్జాలంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాల్లోని సుమారు 20 వేల మంది యువతకు ఇదొక మంచి అవకాశంగా చెప్పవచ్చు.



అర్హులెవరంటే... పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీలోని వివిధ సబ్జెక్టులు పూర్తిచేసినవారు, డిప్లొమా చేసినవారు పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు 21 నుంచి 24 సంవత్సరాల లోపు ఉండాలి. కేంద్ర మంత్రిత్వ శాఖ www.pminternship.mca.gov.in పోర్టల్‌లో అంతర్జాలం ద్వారా అభ్యర్థి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంది. ఈ నెల 25వరకు దీనికి అవకాశం ఇచ్చారు. ఆధార్ అనుసంధానమైన చరవాణి నంబర్, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అభ్యర్థి ప్రొఫైల్‌తో ఈకేవైసీ పూర్తిచేయాలి. చిరునామా, కేటగిరి, ఈ మెయిల్ ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలి.

ఈ పత్రాలు కావాలి... ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటో, విద్యార్హత పత్రం, నేటివిటీ సర్టిఫికెట్ ఉండాలి. ఎంపికైతే మెయిల్‌కు ఆఫర్ లెటర్ వస్తుంది. వెబ్‌సైట్ నుంచి లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆబ్జెక్టివ్ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి 12 నెలల పాటు శిక్షణ ఇవ్వడంతోపాటు వన్‌టైం గ్రాంటుగా రూ.6 వేలు, ప్రతినెలా ప్రభుత్వం 4,500, కంపెనీ రూ.500 చొప్పున డీబీటీ ద్వారా జమచేస్తారు. ఏడాదికి ఇలా రూ.66 వేలు పొందే అవకాశం ఉంది.

వీటిలో నైపుణ్యం... ఈ పథకంలో సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్అండ్ ఎనర్జీ, మైనింగ్, టెలికాం, రిటైల్ వంటి రంగాల్లో శిక్షణ ఇచ్చి అభ్యర్థులకు నైపుణ్యం పెంపొందించనున్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటే యువత ఉపాధికి ఢోకా ఉండదని నిపుణులు చెబుతున్నారు.

శవాగార ఉద్యోగి తొలగింపు

మృతదేహాల మాయంపై సాగుతున్న విచారణ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు సర్వజన ఆసుపత్రి శవాగారంలో మృతదేహాల మాయం వ్యవహారంపై ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ సుధాకర్ బృందం విచారణ చేస్తోంది. 8న రాత్రి శవాగారం నుంచి మృతదేహాన్ని మాయం చేసేందుకు ప్రయత్నించి దొరికిన మార్చురీ అసిస్టెంట్ అశోక్‌ను విధుల నుంచి తొలగిస్తూ సుధాకర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కొంతకాలం నుంచి శవాగారంలోని మృతదేహాలను మాయం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చెన్నై, ఇతర రాష్ట్రాలకు చెందిన వైద్య కళాశాలలకు వాటిని అమ్మేస్తున్నారని తెలిసింది. ఇప్పటి వరకు ఎన్ని మృతదేహాలను ఏయే వైద్య కళాశాలలకు అనధికారికంగా అమ్మారు, ఎప్పుడెప్పుడు ఎంతకు విక్రయించారనే విషయమై కూపీ లాగుతున్నారు. ఈ వ్యవహారంలో అశోక్‌తో పాటు ఇంకెంతమంది ఉన్నారో వారి వివరాలనూ బయటకు తీస్తున్నారు. మొత్తం నలుగురైదుగురు ముఠాగా ఏర్పడి ఈ దందా చేసినట్లుగా భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. వీరి వెనుక చక్రం తిప్పింది శవాగారానికి అనుబంధంగా ఉన్న విభాగంలోని ఓ అధికారి అని ఆరోపణలు రావడంతో ఆ దిశగా కూడా విచారణ చేపట్టారు. నాలుగైదు రోజుల్లో ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి ఓ నివేదిక తయారుచేయనున్నారు.

రైతుల్ని అప్రమత్తం చేయండి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో ఈ నెల 24, 25 తేదీల్లో భారీ వర్షాలు పడే అవకాశమున్నందున రైతులను అప్రమత్తం చేయాలని కలెక్టర్ నాగరాణి అధికారులకు సూచించారు. నష్ట నివారణకు మండలాల వారీగా ముందస్తు ప్రణాళిక రూపొందించుకుని సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులంతా బృందంగా ఏర్పడి సమన్వయంతో పని చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకి తరలించేలా చూడాలన్నారు.

బీమా పథకాలతో పేదలకు మేలు.. పేదలకు మేలు చేసే ప్రధాన మంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా పథకాలపై అవగాహన కల్పించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ నాగరాణి అధికారులకు సూచించారు. ఈ పథకాలకు సంబంధించిన గోడపత్రాలను ఆమె జిల్లా అధికారులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోడూరులో 68.2 మి.మీ. వర్షం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు 7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పోడూరు మండలంలో 68.2 మి.మీ. వర్షం కురిసింది. మొగల్తూరు 12.4, ఆచంట 10, తాడేపల్లిగూడెం, అత్తిలి, గణపవరం, పాలకోడేరు, పెనుమంట్ర, వీరవాసరం, భీమవరం, కాళ్ల, నరసాపురం, పాలకొల్లు మండలాల్లో పది మి.మీ. కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.



గోతులా.. బావులా

.. అటు ప్రయాణం సాహసమే!

పెనుమంట్ర, మార్టేరు, న్యూస్‌టుడే: చినుకు పడితే చాలు.. అటు ప్రయాణమంటే ప్రాణసంకటంగా మారింది. పెనుమంట్ర మండలం బ్రాహ్మణచెర్వు నుంచి వీరవాసరం మార్గంలో పోలమూరు శివారు నౌడూరు వద్ద ర.భ.శాఖ రహదారి మడుగులా మారింది. రోడ్డుపై లోతుగా ఉన్న గుంతల్లోకి నీరు చేరడంతో వాటిని అంచనా వేయలేని స్థితిలో నిత్యం పదుల సంఖ్యలో వాహన చోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు. కనీసం నీరు వెళ్లే మార్గం చేసినా కొంత సమస్య తీరే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు చొరవ చూపడం లేదు. ఫలితంగా ఇటువైపు వచ్చే ప్రయాణికులు బురదమయంగా మారిన దుస్తులతో ఇళ్లకు తిరిగి వెళ్తున్నారు. ఈ రెండు రోజుల్లోనే సమారు పది మంది పైగా తమ కుటుంబ సభ్యులతో వెళ్తూ గుంతల్లో పడిపోయారు. ఈ క్రమంలో వాహనంతో సహా కింద పడిపోవడంతో బ్యాగులు, చరవాణులన్నీ పాడవుతున్నాయి.

డీఎస్సీ ఉచిత శిక్షణకు గడువు పెంపు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: డీఎస్సీకి సిద్ధమయ్యే పేద, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గురుకుల, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. అర్హులు జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

28 కాసుల ఆభరణాలు చోరీ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి ఆభరణాల సంచి చోరీకి గురైంది. పట్టణ సీఐ ఎం.నాగరాజు కథనం ప్రకారం.. బాధితురాలు కె.నాగఉమామహేశ్వరి భీమవరం వచ్చేందుకు ఈ నెల 20న వీరవాసరంలో ఆర్టీసీ బస్సు ఎక్కారు. పట్టణంలో ఆర్టీసీ డిపో వద్దకు వచ్చేసరికి 28 కాసుల బంగారు ఆభరణాలు ఉంచిన సంచి చోరీకి గురైనట్లు గురించారు. ఈ ఘటనపై సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీసు అమరులు చిరస్మరణీయులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల కోసం పోరాడుతూ అమరులైనవారిని స్మరించుకోవడం మనందరి బాధ్యత అని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని భీమవరం మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులు చిరస్మరణీయులన్నారు. మాతృభూమి శ్రేయస్సు కోసం పనిచేసిన నిస్వార్థ శ్రామికులు పోలీసులు అన్నారు. అమరుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతర శ్రమించే పోలీసుల సేవలు అభినందనీయమన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ఉత్సవాలు, శాంతి భద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత తదితర అంశాల్లో వారి సేవలు మరిచిపోలేనివన్నారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు మాట్లాడుతూ సమాజం కోసం పనిచేసే వారు ఎప్పటికీ గుర్తుండిపోతారన్నారు. ఉండి, భీమవరం ఎమ్మెల్యేలు కనుమూరి రఘురామకృష్ణరాజు, పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, అదనపు ఎస్పీ వి.భీమారావు, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం అమరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు.

సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు ఎంపిక

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి టి.విమలాకర్ సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎ.మారుతిదేవి చౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరచి నాలుగో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ నెల 30 నుంచి తమిళనాడులో నిర్వహించే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విమలాకర్‌ను ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


విమలాకర్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పురుగు మందులకు ప్రత్యామ్నాయాలు అవసరం

మార్టేరు, న్యూస్‌టుడే: సాగులో విచక్షణా రహితంగా వినియోగిస్తున్న పురుగు మందులతో తీవ్రమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వాటికి ప్రత్యామ్నాయాలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిద్ధిఖి అన్నారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సమగ్ర సస్యరక్షణ- మానవ వనరులు సంరక్షణ అంశంపై అయిదు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ సోమవారం ప్రారంభమైంది. సిద్ధిఖి మాట్లాడుతూ పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా వృక్ష సంబంధిత కాషాయాలు, జీవ నియంత్రకాల వాడకంపై దృష్టి సారించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఏడీఆర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ వరి పంటలో ఎలుకలు, పురుగులు, తెగుళ్ల సమస్యతో సుమారు 30 శాతం దిగుబడికి నష్టం జరుగుతుందన్నారు. దీనిని తగ్గించుకొనేందుకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమస్య సస్యరక్షణపైనే కాకుండా సమగ్ర పంటల యాజమాన్యంపై శిక్షణ అవసరం ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి గోదావరి మండలం పరిధిలోని అయిదు జిల్లాల నుంచి ఎంపిక చేసిన 50 మంది ప్రతినిధులు హాజరు కాగా వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గోస్వామి, పరిశోధన స్థానం విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త ఎంపీ.కృష్ణాజీ, తదితరులు పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన వివిధ జిల్లాల ప్రతినిధులతో సిద్ధిఖి, శ్రీనివాస్, తదితరులు

ఇజ్రాయెల్ పంపిస్తానని.. రూ.కోటిన్నరకు కుచ్చు టోపీ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధి కోసం ఇజ్రాయెల్ పంపిస్తానని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన పాస్టర్ ఆకుల షాలెం రాజు డబ్బులు తీసుకుని మోసం చేశారని బాధితులు వాపోయారు. సోమవారం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశాడరన్నారు. తర్వాత కాలయాపన చేస్తుండటంతో గట్టిగా నిలదీయగా టూరిస్టు వీసాపై జోర్డాన్ తీసుకు వెళ్లి 15 రోజుల తర్వాత హైదరాబాద్ తీసుకువచ్చి వదిలేశాడని వాపోయారు. తామిచ్చిన సొమ్ము ఇవ్వాలని అడిగితే తిరిగి బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. బాధితుల్లో అమలాపురం, రావులపాలెం, రాజోలు, పి.గన్నవరం, అంతర్వేది, పాలకొల్లు, ఒంగోలు ప్రాంతాలకు చెందిన 33 మందికిపైగా ఉన్నట్లు వారు తెలిపారు. అనంతరం ఆకుల షాలెంరాజు, ఆయన భార్యపై అల్లవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 138, 147, 158 చికెన్ విత్ స్కిన్ - 266 చికెన్ స్కిన్‌లెస్ - 276.

మిశ్రమ సేద్యం.. లాభయోగ్యం..!

తక్కువ విస్తీర్ణంలో సత్ఫలితాలు సాధిస్తున్న అన్నదాత


సిద్ధాంతంలో దొండ పందిర్లు కింద వేసిన కంద పంట

పెనుగొండ గ్రామీణ, మార్టేరు, న్యూస్‌టుడే

తక్కువ విస్తీర్ణంలో మిశ్రమ పంటలు సాగుచేస్తే మంచి ఆదాయం ఆర్జించవచ్చని నిరూపిస్తున్నారు పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన కౌలు రైతు కుడిపూడి ముసలయ్య. చదివింది తక్కువైనా మిశ్రమ సాగులో సుదీర్ఘ అనుభవం సాధించారు. ప్రస్తుతం 90 సెంట్లు కౌలు భూమిలో దొండతో పాటు కంద సాగు చేస్తూ తనతో పాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు.

దొండలో నష్టం ఉండదు

భూమి కౌలుతో పాటు విత్తనం, పందిరి, కూలీలు, ఇతర ఖర్చులన్నీ కలిపి సుమారు రూ.2.50 లక్షల దాకా అవుతోంది. అన్నీ అనుకూలిస్తే మంచి ఆదాయం వస్తోంది. కంద పంట కాలం ఆరు నెలలు. దొండ పంట చేతికి రావడానికి 180 రోజుల సమయం పడుతోంది. పంటను సిద్ధాంతం, పెనుగొండ ఇతర స్థానిక మార్కెట్‌లకు తీసుకెళ్లి విక్రయిస్తాం. ఒక్కోసారి మార్కెట్‌లో ఈ పంటలకు ఎక్కడా లేని డిమాండ్ ఉంటుంది. దొండ పంటలో నష్టమనే మాట ఉండదు.

కంద సాగులో..

కంద సాగు వెనుక కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. కంద మొక్క వేర్లు మట్టిని గుల్ల చేస్తాయి. పంటల మీద చీడ పీడల సమస్య అంతగా ఉండదు. పైగా పెట్టుబడి ఖర్చు తక్కువ. కాలానుగుణంగా పంట మార్పిడి కచ్చితంగా చేస్తే దాని ఫలితం కనిపిస్తోంది.

మంచి ఆదాయమే

'కూరగాయ సాగులో కష్టానికి తగిన ఆదాయం ఉంటుంది. నా వరకు ఈ రెండు పంటల మీద ఏడాదికి అన్ని ఖర్చులు పోనూ రూ.లక్షకు పైగా రాబడి ఉంటుంది. అడపాదడపా ఈ పంటలను గ్రామంలో తిరిగి అమ్మినప్పుడు వచ్చిన సొమ్ముతో ఇంటి ఖర్చులన్నీ అధిగమిస్తాం. పరిస్థితులకు అనువుగా పంటలను ఎంపిక చేసి సాగు చేస్తే సిరులు పండుతాయి' అని రైతు ముసలయ్య తెలిపారు.



వనామీ సాగులో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: వనామీ సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడులు, లాభాలు ఆర్జించవచ్చని ఆక్వారంగ నిపుణుడు డాక్టర్ అడబాల గోపాలరావు సూచించారు.

ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసంతో.. కొన్ని రోజులుగా పగలు ఓ పక్క వర్షాలు కురుస్తున్నా.. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రి సమయంలో చలిగాలులు ప్రారంభమయ్యాయి. చెరువు నీటిలో తరచూ ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం వస్తే రొయ్యల్లో జీవక్రియ మందగిస్తుంది. కదలిక తగ్గి చెరువు అడుగు భాగానికి చేరుతుంటాయి. నీటిలో ఉదజని సూచిక, క్షారత్వం, లవణీయతల్లో వ్యత్యాసం చోటు చేసుకుంటాయి. వీటి ప్రభావంతో రొయ్యల్లో వ్యాధినిరోధకత తగ్గుతుంది. మేత వినియోగం తగ్గిస్తాయి. ఆ సమయంలో చెక్‌నెట్‌లను గమనించి రోజూ చల్లే మేత పరిమాణం తగ్గించాలి.



నివారణ చర్యలు.. చెరువు నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గకుండా, 5 పీపీయం ఉండేలా చూడాలి. ఉదజని సూచిక తగ్గినప్పుడు వ్యవసాయ సున్నం వాడాలి. మేతలో విటమిన్ సి కలిపి వినియోగించాలి. చెరువు నీటిలో ప్రొబయోటిక్స్ చల్లాలి. అవసరమైతే ఆక్వా ల్యాబ్‌లో నీటి నాణ్యత పరీక్షలు చేయించి నిపుణుల సూచనల మేరకు చర్యలు చేపట్టాలని గోపాలరావు సూచించారు.

రైతేరాజు

మీరూ అడగొచ్చు

ప్రశ్న: బొప్పాయిలో ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు పసుపు రంగుకి మారి రాలిపోతున్నాయి ఏం చేయాలి ?
- చంద్రశేఖర్, నీలాద్రిపురం

సమాధానం: లీటరు నీటికి మాంకొజెబ్ 2.5 గ్రా లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు దఫాలుగా పిచికారీ చేయాలి. మార్కెటింగ్‌కి అనుకూలంగా లేని పచ్చికాయలను పాల సేకరణకు వినియోగించాలి.


డాక్టర్ ఇ.కరుణశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం
© చరవాణి 73826 33692

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

మానిపండు తెగులు ఆశిస్తే నష్టం

మార్టేరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం వరి పంటను మానిపండు తెగులు ఆశిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు టి.శ్రీనివాస్ సూచించారు. పంట పూత దశ నుంచి గింజ గట్టి పడే దశలో మంచు, వర్షం అధికంగా ఉంటే ఇది వ్యాపిస్తుంది. తెగులు సోకిన మొక్కలో అప్పుడే ఏర్పడుతున్న గింజల నుంచి ఆకుపచ్చ రంగులో శిలీంద్రం ముద్దగా స్రవిస్తుంది. తర్వాత అది నల్లగా మారుతుంది. దీని వల్ల తాలు గింజలు ఏర్పడతాయి. పైరు 50 శాతం వెన్ను బయటకు వచ్చిన సమయంలో (సాయకాలం) శిలీంద్రనాశక మందులు వాడాలి. కార్బండిజమ్ 1గ్రాము లేదంటే ప్రొపికోనజోల్ 1 మిల్లీ లీటరు లేదా క్రెసాక్సిమ్ మిథైల్ 1మిల్లీ లీటరు.. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొలంలో, గట్ల చుట్టూ కలుపు మొక్కలను తొలగించాలి.

భీమవరం

• భీమవరం • ఉండి



విద్యార్థులు, అధికారులతో న్యాయమూర్తి సురేష్‌బాబు

పంకాలు తిరగవు.. దీపాలు వెలగవు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: న్యాయసేవా ధికార సంస్థ ఆదేశాల మేరకు భీమవరంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు సోమవారం పరిశీలించారు. సౌకర్యాలపై విద్యార్థులను ఆరా తీశారు. పంకాలు తిరగడంలేదని, దీపాలు వెలగడంలేదని విద్యార్థులు ఆయనకు ఫిర్యాదు చేశారు. అర్జీ ఇస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని న్యాయమూర్తి తెలిపారు.

నేడు చిన్నారులకు గుండె పరీక్షల శిబిరం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమవరం పరిధి మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి చిన్నపిల్లలకు ఉచితంగా గుండె పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి. బలరాం తెలిపారు. సేవా విజ్ఞాన కేంద్రం, వసుధ ఫౌండేషన్, ఎస్ఎల్‌జీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో 15 ఏళ్లలోపు పిల్లలకు 2డీ ఎకో, ఈసీజీ, ఇతర పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా చేయిస్తామని వసుధ ఫౌండేషన్ సమన్వయకర్త ప్రసాదరాజు తెలిపారు. ఈ కేంద్రంలో నిత్యం నిర్వహించే సాధారణ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

ఆకివీడు, న్యూస్‌టుడే



సమస్య: ఆకివీడు నగర పంచాయతీలో చెత్తను సిద్ధాపురం రహదారి పక్కన దిగుమతి చేస్తున్నారు. ఇక్కడ చెత్తకుప్పలు భారీగా పేరుకుపోయి రోడ్డుపైకి చేరుతున్నాయి. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

సమాధానం: రహదారిపైకి చెత్త చేరకుండా రేకులు ఏర్పాటు చేయిస్తాం. **- వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్**

వంతెన దాటితే.. గండం గడిచినట్లే..!

ఏళ్ల తరబడి కనీస మరమ్మతులూ కరవే..



భీమవరం ప్రాంతంలో గోస్తనీ- వేల్పూరు కాలువపై ఉన్న ఈ వంతెన పదేళ్ల కిందటే శిథిలావస్థకు చేరింది. భీమవరం, మొగల్తూరు మండలాల్లో అనేక గ్రామాల ప్రజల రాకపోకలకు ఇదే ప్రధాన మార్గం. ఇది కూలితే వేలాది మంది ప్రజలకు అవస్థలు తప్పవు. కొద్ది నెలల కిందట వంతెనకు ఓ పక్క భాగం జారిపోవడంతో తాత్కాలికంగా వెదురు తడికలు ఏర్పాటు చేశారు.

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం నియోజక వర్గంలో కీలక మార్గాల్లో పంట, మురుగు కాలువలపై ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధితో పాటు వంతెనల నిర్మాణాలను విస్మరించడంతో పరిస్థితి దిగజారింది. కొన్ని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలు సైతం లేకపోవడంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని శిథిల వంతెనలపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గత అయిదేళ్లు వీటికి మరమ్మతులు కూడా చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త వంతెనల నిర్మాణంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. దొంగపిండి, కొమరాడ, గొర్లమూడి, పల్లిపాలెం, వెంప-మొగల్తూరు మార్గాల్లో వంతెనలు కూడా శిథిలస్థితికి చేరాయి.

ప్రతిపాదనలు పంపుతాం

కొన్ని చోట్ల వంతెనలు శిథిలస్థితిలో ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొత్త నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతాం. **- రాజశేఖర్, ఆర్అండ్‌బీ జేఈ**



భీమవరం మండలం గొల్లవానితిప్ప- తుమ్మగొప్ప గ్రామాల మధ్య పాతకాలువపై వంతెన ఇది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇది కీలక మార్గం. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన వంతెన నిర్మించాలని ప్రజలు కొన్నేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం లేకపోయింది.



పర్యవేక్షిస్తున్న కాకతీయ పాఠశాల కరస్పాండెంట్ కృష్ణకిశోర్

పోటీలతో మేధస్సుకు పదును

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ నిర్మల

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని శ్రీ కాకతీయ మెరిట్ పాఠశాల, డాక్టర్ సీఎస్ఎన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు సోమవారం జరిగాయి. ఇలాంటి పోటీలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చని ఉపాధ్యాయులు అన్నారు. 'అంతర్జాలం వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

● శ్రీకాకతీయ పాఠశాలలో బి.జయశ్రీ (10వ తరగతి), సీహెచ్ మోహన మురళీకృష్ణ ప్రసాద్ (8వ తరగతి), కె.పావని (9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. బహుమతులను కరస్పాండెంట్, సెక్రటరీ అక్కినేని కృష్ణకిశోర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అందజేశారు.

● డాక్టర్ సీఎస్ఎన్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు పి.రిషిత, కె.భావన, పి.హెప్సీ రంజన విజేతలుగా నిలవగా ప్రిన్సిపల్ ఎన్.నిర్మల బహుమతులు అందజేశారు.

మురుగు మళ్లింపునకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

పాలకోడేరు, న్యూస్‌టుడే: వేండ్ర పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలో మురుగును బయటకు మళ్లించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలో వీధులు, రహదారులు, ఇళ్ల మధ్య వాననీరు, మురుగు నిలిచిపోయి స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ నెల 19న 'ఇళ్ల మధ్యే మురుగు' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ స్పందించారు. ఆ ప్రాంతంలో కచ్చా డ్రెయిన్ల ప్రక్షాళన పనులను సోమవారం చేయించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

ఉండి, న్యూస్‌టుడే: రుణ, రుణేతర కార్యకలాపాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా సహకార సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. ఉండిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల పాటు నిర్వహించే ధ్రువపత్ర కోర్సును ఆమె సోమవారం ప్రారంభించి మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే సేవలను సహకార సంఘాల ద్వారా అందించాలన్నారు. జిల్లాలో లైసెన్సులు అవసరమైన 76 సహకార సంఘాల ప్రతినిధులకు ఉండి, వెంకట్రామన్నగూడెం, గరికిపాడు, నెల్లూరు, గుంటూరు కేవీకేల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఎన్.మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో మార్టేరు వరి పరిశోధన స్థానం సహ సంచాలకుడు టి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు, జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు, డీసీవో కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యం

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రగతి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వల్లే సాధ్యమని తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం మండలం నర్సింహపురం సర్పంచి ఇందుకూరి లక్ష్మీప్రసన్న, ఉపసర్పంచి ఇందుకూరి ఆంజనేయరాజు, పట్టణంలో ఒకటో వార్డుకు చెందిన కడలి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 150 మంది వైకాపా కార్యకర్తలు సోమవారం వారి సమక్షంలో తెదేపాలో చేరారు. తెదేపా రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, అల్లూరి సుబ్రహ్మణ్యంరాజు తదితరులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వైకాపా పూర్తిగా ఖాళీ అవుతుందని పేర్కొన్నారు. తెదేపా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు యిందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, గూడూరి సుబ్బారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రేవు వెంకన్న, కవురు పృథ్వీశంకర్, వీరవాసరం మండల అధ్యక్ష, కార్యదర్శులు కారేపల్లి శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల నాగబాబు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీతారామలక్ష్మి, మంతెన రామరాజు

ఆలయాల పునర్నిర్మాణానికి ప్రాధాన్యం



శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

ఆరేడు (ఉండి), న్యూస్‌టుడే: పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు తెలిపారు. ఆరేడు గ్రామంలో 200 ఏళ్ల నాటి తాండవేశ్వర, కేశవస్వామి ఆలయాల పునర్నిర్మాణానికి ఆయన సోమవారం శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. రూ.1.52 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, సర్పంచి కట్రెడ్డి బ్రహ్మానందం, ఎంపీటీసీ సభ్యుడు రుద్రరాజు యువరాజు, మాజీ సర్పంచి పోలేశ్వరరావు, తెదేపా, జనసేన, భాజపా నాయకులు గొట్టం బాబీ, మంచు సత్యనారాయణ, కోడే వెంకట సుబ్బారావు, ఈవో రాధ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారులకు శంకుస్థాపన

పాములపర్రు (ఉండి), న్యూస్‌టుడే: పాములపర్రు గ్రామంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణానికి తెదేపా సమన్వయ కమిటీ సభ్యుడు తోట శ్రీరాములు ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేశారు. సర్పంచి కేశన శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యుడు యడవల్లి వెంకటేశ్వరరావు, నాయకులు కేశన యాదగిరి, కోమటి నరేంద్ర, వర్రే సముద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో కలవరం



ఈదురు గాలులకు కూలిన వృక్షం

బాలేపల్లి (వీరవాసరం), న్యూస్‌టుడే: మరోసారి తుపాను ముప్పు పొంచి ఉందనే హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాపై పెద్దగా ప్రభావం ఉండదని అధికారులు చెబుతున్నా వరి సాగు కీలక దశలో ఉన్న నేపథ్యంలో భారీ వర్షాలు కురిస్తే దిగుబడులపై ప్రభావం పడుతుందని రైతులు పేర్కొంటున్నారు. వీరవాసరం మండల వ్యాప్తంగా సోమవారం ఈదురు గాలులు వీచాయి. కొన్ని ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. దట్టమైన మబ్బులు కమ్మేసి పిడుగులు పడ్డాయి. చివరకు చెదురుమదురుగా వర్షం కురిసి మేఘాలు తేలిపోవడంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు.

మావుళ్లమ్మకు స్వర్ణం సమర్పణ



బంగారం అందజేస్తున్న వీరేంద్రబాబు దంపతులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయానికి పట్టణానికి చెందిన బి.వీరేంద్రబాబు, దేవీ కృష్ణప్రభ దంపతులు 18 గ్రాముల బంగారాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా సోమవారం సమర్పించారు. స్వర్ణచీర నిమిత్తం అందజేసిన ఈ బంగారం విలువ రూ.1.46 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

వైభవంగా మద్దిరావమ్మ జాతర



అమ్మవారిని నడివీధికి తీసుకొస్తున్న భక్తులు

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల గ్రామంలో మద్దిరావమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారిని నడివీధికి ఊరేగింపుగా తీసుకు వచ్చే వేడుకను ఆదివారం రాత్రి నిర్వహించారు. రామాలయం కూడలి వద్ద పూరిగుడిసె వేసి అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. ఈ నెల 24న గ్రామోత్సవం జరుగుతుందని నిర్వాహకులు, గ్రామ పెద్దలు తెలిపారు.

సోమేశ్వరునికి అభిషేకాలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఆశ్వయుజ మాస సోమవారం సందర్భంగా పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దన స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామికి బిల్వార్చన, సహస్ర నామ పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

క్రీడాకారుడికి అభినందన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపి పతకం సాధించిన గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన బొడ్డు మహేశ్‌ను శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు సోమవారం అభినందించారు. ఈ నెల 16న భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో జరిగిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో మహేశ్ ద్వితీయ స్థానంలో నిలిచారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పాలకోడేరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో గాయాలపాలైన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పాలకోడేరు ఎస్సై ఎన్.హరిబాబు సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గరగపర్రుకు చెందిన దొండపాటి ఏసేబు (65) ఉండి రోడ్డులోని ఓ షోరూం వద్ద కాపలాదారుగా పనిచేస్తున్నారు. ఈ నెల 16న ఉదయం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా గొల్లలకోడేరు వద్ద అదుపు తప్పిపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆయనను భీమవరంలో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు.

కాలువలో దూకిన యువకుడు

పాలకోడేరు, న్యూస్‌టుడే: మహదేవపట్నం గ్రామానికి చెందిన ఓ యువకుడు సోమవారం గరగపర్రులోని ఉప్పరిగూడెం వంతెన వద్ద కాలువలో దూకినట్లు సమాచారం అందడంతో పోలీసులు, అగ్నిమాపక అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు అతడి ఆచూకీ లభించకపోవడంతో వారంతా వెనుదిరిగారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆ యువకుడు కుటుంబ సభ్యులకు చరవాణిలో తెలిపినట్లు సమాచారం.

భార్యపై భర్త దాడి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఎంఆర్‌నగర్‌కు చెందిన ఎస్.దేవి భవానిపై ఆమె భర్త రామకృష్ణ దాడికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. భర్త మద్యం తాగి వచ్చి వేధిస్తుండటంతో భవాని 5 నెలల క్రితం పుట్టింటికి వచ్చారు. భర్త ఆదివారం అక్కడికి వెళ్లి ఆమెపై దాడికి దిగారు.

డిజిటల్ విపణిలో మెరుపులు

● మెప్మా ఉత్పత్తులకు భలే గిరాకీ ● యాప్‌ల ద్వారా విక్రయాలు



ఆన్‌లైన్‌లో లేసు అల్లిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఇంటి వద్ద ఖాళీ సమయాల్లో మెప్మా సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులను డిజిటల్ విపణి ద్వారా ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన సమీక్షలో సీఎం చంద్రబాబు చేసిన సూచనల మేరకు ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) వేదికగా ఆన్‌లైన్ విక్రయాలకు అనువుగా యాప్‌లను రూపొందించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో పలు సంఘాల సభ్యులను ఎంపిక చేసి వారు తయారు చేసిన వస్తువులకు ఈ యాప్‌ల ద్వారా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నారు.

222 మంది ఎంపిక

ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు వీలుగా 26 యాప్‌లను సిద్ధం చేశారు. వీటిని ఎంపిక చేసిన 222 మంది ఇప్పటికే సద్వినియోగం చేసుకుంటున్నారు. వీరికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు భీమవరం పురపాలక కార్యాలయంలోని మెప్మా విభాగంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మగ్గంతో నేసిన వస్త్రాలు, రోల్డుగోల్డు ఆభరణాలు, లేసు అల్లికలు, పచ్చళ్లు, పిండి పదార్థాలు, మిఠాయిలను వీటి ద్వారా విక్రయిస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి..



మేం తయారు చేసే లేసు అల్లికలకు ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా వేర్వేరు ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. వాటికి తగ్గట్టుగా ముడి సరకు తెచ్చి వేగంగా తయారు చేసి అందజేస్తున్నాం. గతంలో స్థానికంగా మాత్రమే విక్రయాలు జరిగేవి. డిజిటల్ విపణి ద్వారా ఇతర ప్రాంతాల వారు కూడా కొనుగోలు చేస్తున్నారు. **- పి.వీరకుమారి బృందం, భీమవరం**

అవగాహన కల్పిస్తున్నాం..



మహిళా సంఘాల సభ్యులకు డిజిటల్ వాణిజ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు గుర్తించిన సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో ఉంచుతున్నారు. పది మంది సభ్యులకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షలు వరకు రాయితీ రుణాలు అందిస్తున్నాం. **- ఎన్.ఉమాదేవి, డీఆర్‌పీ**

డంపింగ్ యార్డుకు చెరువు భూములా?

ప్రతిపాదనపై కౌన్సిలర్ల వ్యతిరేకత



ఛైర్‌పర్సన్, కమిషనర్‌లకు డి-సెంట్ నోటీసు అందిస్తున్న కౌన్సిలర్లు

ఆకివీడు, న్యూస్‌టుడే: భవిష్యత్తు అవసరాల కోసం చెరువును అభివృద్ధి చేయాల్సింది పోయి. . డంపింగ్ యార్డుకు కేటాయిస్తారా అంటూ పలువురు కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. ఆకివీడు నగర పంచాయతీ పాలకమండలి అత్యవసర సమావేశాన్ని ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. 6.22 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొండయ్య చెరువును డంపింగ్ యార్డుకు కేటాయించే అంశంపై ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ ప్రతిపాదనను జనసేన, వైకాపా సభ్యులు పుప్పాల సత్యనారాయణ (పండు), నిమ్మల నాగు, తిరుమారెడ్డి మాధవి, మోలుపల్లి కుమారి, గుర్రాని నాగలక్ష్మి, గోపిశెట్టి సత్యవతి తదితరులు తీవ్రంగా వ్యతిరేకించారు. అనంతరం కమిషనర్ కృష్ణమోహన్, ఛైర్‌పర్సన్ హైమావతిలకు డి-సెంట్ నోటీసు ఇచ్చారు. కౌన్సిలర్ల అభ్యంతరాలను కలెక్టర్‌కు నివేదిస్తామని కమిషనర్ తెలిపారు.

విద్యార్థులకు రచనల పోటీ

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రచనల పోటీలు నిర్వహిస్తున్నారు. నవ భారత నిర్మాణం, విద్యార్థుల పరిశోధనలు- నూతన ఆవిష్కరణలు, పొదుపు- నిరాడంబరత, నీతి కథలపై విద్యార్థుల స్వీయ రచనలను నవంబరు 5 లోపు కార్యదర్శి, సర్వోదయ మండలి గాంధీ కస్తూరిబా భవనం, శ్రీరామపురం, భీమవరం-2 చిరునామాకు పంపాలి. ఉత్తమ రచనలను బాలభాషిణి పత్రికలో ప్రచురించడంతో పాటు విజేతలకు నవంబరు 14న బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకలో బహుమతులు అందజేయనున్నట్లు సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు.

ప్లాస్టిక్ పరిశ్రమతో కాలుష్యం



కలెక్టర్‌కు సమస్య చెబుతున్న ఆకివీడు వాసులు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆకివీడు పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ పరిశ్రమకు అనుమతి ఇచ్చారని స్థానికులు ఆరోపించారు. దీనిని రద్దు చేయాలని కోరుతూ ఆకివీడుకు చెందిన పలువురు సోమవారం కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందించారు. కొల్లేరు 5వ కాంటూరు పరిధిలో పర్యావరణ పరంగా సున్నితమైన జోన్‌లో ఇలాంటి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం లేదని పేర్కొన్నారు. ఈ పరిశ్రమల వల్ల సహజ వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బైరి ఆంజనేయులు, ఓగిరాల ఏలియా, శివ, జ్ఞానప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రుసుముల భారం మోపితే ఉద్యమిస్తాం



ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వీరవాసరం, న్యూస్‌టుడే: ఇంధన సర్దుబాటు రుసుముల పేరిట అదనపు భారం మోపితే ప్రజా ఉద్యమాలు తప్పవని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జుత్తిగ నరసింహమూర్తి పేర్కొన్నారు. రుసుముల పెంపు ప్రతిపాదనలు, విద్యుత్తు సంస్కరణలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో వీరవాసరంలోని ఉప కేంద్రం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. నరసింహమూర్తి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అడ్డగోలుగా విద్యుత్తు ఛార్జీలు పెంచిందని గతంలో విమర్శించిన ప్రస్తుత సీఎం చంద్రబాబు ఇప్పుడు రుసుముల పెంపు ప్రతిపాదనకు అంగీకారం తెలపడం సరికాదన్నారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు.

ఉండి, న్యూస్‌టుడే: సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉండి ప్రధాన వంతెన కూడలి వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్తుపై అదనపు ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అనుసంధాన మార్గాలు నిర్మించరూ..

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: యనమదుర్రు కాలువపై నిర్మించిన వంతెనలకు అనుసంధాన మార్గాలు నిర్మించాలని భీమవరం పట్టణ శాఖ సీపీఎం మహాసభ ప్రభుత్వాన్ని కోరింది. పార్టీ కార్యాలయంలో నాయకుడు దండుబోయిన త్రిమూర్తులు అధ్యక్షతన సోమవారం జరిగిన మహాసభలో పలు సమస్యలపై నాయకులు చర్చించారు. అల్లూరి సీతారామరాజు పురపాలక భవనాన్ని పునర్నిర్మించాలని, ప్రభుత్వ కొలువులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం పట్టణ శాఖ కార్యదర్శిగా ఎన్.రంగాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు చైతన్య ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు, నజీర్, వేండ్ర సత్యనారాయణ, దండుబోయిన నాగమణి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలంటూ నిరసన



కార్డులను చూపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

భీమవరం టూటౌన్, న్యూస్‌టుడే: సూపర్ సిక్స్ హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంకెం సీతారామ్ విమర్శించారు. హామీలు అమలు చేయాలంటూ పోస్టుకార్డులను రాసి ముఖ్యమంత్రికి పంపారు. తొలుత భీమవరంలోని తపాలా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నాయకులు సోడదాసి సిల్వియా, బోనం రవికుమార్, సత్యవాణి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొలువులు భర్తీ చేయండి

యండగండి (ఉండి), న్యూస్‌టుడే: పంచాయతీలో ఖాళీ కొలువులను భర్తీ చేయాలని యండగండి వినియోగదారుల సంఘం ప్రధాన కార్యదర్శి పీవీఎస్ గోపాలకృష్ణంరాజు అధికారులను విజ్ఞప్తిచేశారు. ఏడాదిన్నర నుంచి యండగండి గ్రామ కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉందన్నారు.

రెండు నెలలుగా అంధకారం

ఉండి, న్యూస్‌టుడే: ఎన్నార్పీఅగ్రహారం పరిధిలో తీగలు కాలిపోవడంతో రెండు నెలల నుంచి వీధి దీపాలు వెలగడంలేదని ఆ గ్రామ ప్రజాప్రతినిధులు సోమవారం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి విద్యుత్తు లైన్‌మెన్‌ను నియమించాలని సర్పంచి సూరవరపు కనకదుర్గ, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	వేట్టయన్
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	దేవర
కిషోర్ స్క్రీన్ 1	విశ్వం
కిషోర్ స్క్రీన్ 2	ఇద్దరు
నటరాజ్	జనక అయితే గనక
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	వేట్టయన్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	శ్వాగ్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	దేవర
విజయలక్ష్మి స్క్రీన్ 1	మార్టిన్
మహాలక్ష్మి స్క్రీన్ 2	కల్లు కాంపౌండ్

నరసాపురం
•నరసాపురం •పాలకొల్లు •ఆచంట

ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన ఆధార్ ప్రత్యేక శిబిరం కార్యక్రమాన్ని ఈ నెల 22 నుంచి 25 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణంరాజు తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో లక్ష్మణేశ్వరం-1 ఎల్‌బీచర్ల, సరిపల్లి, సచివాలయాలలోను, ఈ నెల 24 నుంచి 25 వరకు లక్ష్మణేశ్వరం-2, పసలదీవి, లిఖితపూడి గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆధార్ నమోదు కేంద్రాల్లో చిన్నారులు, పాఠశాల విద్యార్థులకు సంబంధించి ఆధార్ సమస్యలు పరిష్కరించుకోవాలని ఎంపీడీవో సూచించారు.

ఘనంగా ఆజాద్ హింద్‌ఫౌజ్ దినోత్సవం

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక జీవీఎస్ వీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఆజాద్ హింద్‌ఫౌజ్ స్థాపన దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఆర్.భవానీప్రసాద్ మాట్లాడారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి జైహింద్ నినాదాలతో హోరెత్తించారు.


నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

క్షీరారామంలో పంచహారతులు


అలంకరణలో స్వామివారు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. స్వామిని నాగాభరణం, రుద్రాక్షలు, పూలతో అలంకరించారు. అనంతరం గోశాలలో అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం పంచహారతులు ఇచ్చారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

నరసాపురం, న్యూస్‌టుడే: మొగల్తూరు ఉప్పింటికాలువ సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రాంగణంలో మయూర వాహనం, ద్వారపాలకులు, రెండు శివలింగాల ప్రతిష్ఠాపన వేడుకను సోమవారం నిర్వహించారు. గుడాల ఉదయభాస్కరరావు వెంకటలక్ష్మి దంపతులు, తదితరుల ఆర్థిక సహకారంతో వీటిని సమకూర్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక బోధన చేసిన శ్రీశైలానికి చెందిన శివచైతన్యానందసరస్వతీ స్వామీజీని సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు, పాశుపతాస్త్ర హోమం చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన చేశారు.

శివాలయ స్థల ఆక్రమణ తొలగింపు

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని రుస్తుంబాద శివాలయం స్థల ఆక్రమణలను సోమవారం తొలగించారు. ఆలయానికి చెందిన స్థలాన్ని ఒక మతసంస్థ నిర్వాహకులు, వ్యాపారి ఆక్రమించారు. హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు ఆందోళన చేశారు. దీనిపై స్పందించిన దేవాదాయశాఖ అధికారులు పట్టణ సీఐ బి. యాదగిరి పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు నడుమ యంత్రంతో ఆక్రమణలు తొలగించారు.

శిథిల భవనం వెంటనే ఖాళీ చేయండి

నరసాపురం, న్యూస్‌టుడే: శిథిలస్థితిలో ఉన్న భవనం వల్ల ప్రమాదం ఉందని, వెంటనే ఖాళీ చేయాలని పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య వ్యాపారులకు సూచించారు. ఆటోస్టాండ్ ఎదురుగా ఉన్న భవనాన్ని సోమవారం ఆయన సందర్శించారు. శిథిలస్థితిలో ఉన్న భవనాలను గుర్తించి వాటిని ముందస్తుగానే కూల్చి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట టీపీఎస్ త్రినాథరావు, పలువురు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సంచార సేవలకు చెల్లు!

కదలని పశు ఆరోగ్య వాహనాలు



★ పట్టణంలోని వేంకటేశ్వర కాలనీలో ఈ ఏడాది జులై నెలలో ఒక ఆంబోతుకు గాయమై సుమారు 15 రోజులు కదలని స్థితిలో ఉంటే స్థానికులు ఆ విషయాన్ని గమనించారు. ఆంబోతు పడుతున్న బాధను చూసి వారు నెస్ట్ ఆర్గనైజింగ్ స్వచ్ఛంద సంస్థకు ఫిర్యాదు చేశారు. వారు పురపాలక అధికారులను సంప్రదించగా సంచార పశు ఆరోగ్య వాహనంలో లిఫ్ట్ పనిచేయడం లేదని, ప్రైవేటు జేసీబీ సాయంతో ఆ ఆంబోతును వైద్య సేవలకు తరలించారు.

★ యలమంచిలి మండలం చించినాడలో సెప్టెంబరు 24న ఒక ఆంబోతుకు గాయమై కదల లేని స్థితిలో ఉండి పోయింది. ఆ ఆంబోతు పరిస్థితి విషమించడంతో నెస్ట్ సంస్థ వారు ఈ వాహనాన్ని సంప్రదించగా అప్పుడు కూడా వాహనాల్లో పరికరాలు లేవని సిబ్బంది చెప్పడంతో ప్రైవేటుగా ఏర్పాటు చేసుకొని పాలకొల్లు పశువైద్యశాలలో చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ మరణించింది.

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సంచార పశు ఆరోగ్య వాహనాలు సేవలు అందడం లేదు. నియోజకవర్గంలో పాలకొల్లు, యలమంచిలి మండలాలకు కేటాయించిన రెండు వాహనాలు తరచూ మరమ్మతులకు వస్తున్నాయి. వీటిని నిలపడానికి సరైన స్థలం కూడా లేని దుస్థితి. ప్రభుత్వ పశువైద్యశాల ముందు, మార్కెట్ యార్డు, ఎక్కడ ఖాళీ కనిపిస్తే అక్కడ నిలుపుతున్నారు. పశువులకు వైద్య సేవలు అందించడానికి అందులో ఉన్న పరికరాలు కూడా పనిచేయడం లేదని రైతులు వాపోతున్నారు.


మార్కెట్ యార్డు ఆవరణలో నిలిపిన వాహనం

డ్రైవర్ల కొరత.. రెండు మండలాలకు ఉన్న రెండు వాహనాలకు ఇటీవల మరమ్మతులు చేయించాం. వాటిలో పశువులను వాహనాల్లోకి ఎక్కించే లిఫ్టులు పనిచేయడం లేదు. యలమంచిలి మండల వాహనానికి డ్రైవర్ లేరు. వాహనాల సేవలు పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు తీసుకుంటాం. **- మల్లేశ్వరరావు, సహాయ సంచాలకులు, పాలకొల్లు ఏరియా పశువైద్యశాల**

పాలకొల్లు మార్కెట్, గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక జీడీఎం చర్చి వెనుక గల శ్రీకృష్ణనగర్‌లో గత కొన్ని రోజులుగా చెత్త తీయడం లేదు. దీని కారణంగా దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంటుంది. **- శ్రీనివాస్, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- దావీదురాజు, పారిశుద్ధ్య అధికారి**

సమస్య: పాలకొల్లు గ్రామీణ పంచాయతీ పూలపల్లిలో డ్రెయిన్‌లో సిల్టు తీసి రహదారి పక్కనే వేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోంది. **- రాము, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకుంటా. **- పి.ఎస్. శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి**

నరసాపురం, గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: రెవెన్యూ డివిజన్ కార్యాలయ ఆవరణలో రాత్రి, పగలూ వీధి దీపం వెలుగుతుంది. **- రాంబాబు, నరసాపురం**

సమాధానం: పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా. **- ఎం.అంజయ్య, కమిషనర్, పురపాలక సంఘం, నరసాపురం**

సమస్య: గ్రామంలోని గ్రామ సచివాలయం సమీపంలో ప్రధాన రహదారి చెంత సగరపేట పరిధిలోని విద్యుత్తు పరివర్తకం చుట్టూ పాదులు అల్లుకున్నాయి. దీంతో తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. **- సూర్యనారాయణ, స్థానికుడు**

సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా స్థానిక విద్యుత్తుశాఖ సిబ్బందికి సూచిస్తా. **- కె.సుధాకర్, విద్యుత్తుశాఖ, గ్రామీణ ఏఈఈ**

మొగల్తూరు, న్యూస్‌టుడే

సమస్య: మొగల్తూరు కొండావారిపాలెం ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. **- నాగేశ్వరరావు, మొగల్తూరు**

సమాధానం: పరిశీలించి మరమ్మతులు చేయించేందుకు చర్యలు చేపడతా. **- ముచ్చర్ల చిన్న, పంచాయతీ కార్యదర్శి, మొగల్తూరు**

ప్రతిభకు పదును పెట్టేలా...

'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీలు





పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పాలకొల్లు బీవీఆర్‌ఎం మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రథమస్థానంలో పి.నిషిత (9వ తరగతి), ద్వితీయస్థానంలో కె.జ్ఞానదీపిక (10వ తరగతి), తృతీయస్థానంలో పి.షర్మిలప్రియ (10వ తరగతి) నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు వై.ప్రభాకరశాస్త్రి, టి.వి.సత్యవతి బహుమతులు అందజేశారు.

ప్రభాస్ అభిమానుల రక్తదానం

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరులో సినిమా హీరో ప్రభాస్ అభిమానులు సోమవారం రక్తదానం చేశారు. ఆయన జన్మదిన వేడుకల్లో భాగంగా రామకృష్ణ చారిటబుల్‌ట్రస్టు, ఉషోదయ వాలంటరీ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక ఆర్కే కార్‌బజారులో రక్తదాన శిబిరం నిర్వహించారు. 23 యూనిట్లు రక్తం దానం చేశారని నిర్వాహకులు తెలిపారు.



కూటమి ప్రభుత్వంతో పల్లెలకు పండగ

మొగల్తూరు, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతో పల్లెలకు పండగ అని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. నియోజకవర్గంలోని కొత్తోట, కాళీపట్నం, పేరుపాలెంసౌత్, రామన్నపాలెం, సీతారామపురంనార్త్, కె.బేతపూడి తదితర గ్రామాల్లో సోమవారం 'పల్లె పండగ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సుమారు రూ.2 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు కొత్తపల్లి సుబ్బారాయుడు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు తదితరులతో కలిసి భూమిపూజ చేశారు. పలు నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవోలు సీహెచ్.త్రిశూలపాణి, జీవీఎస్ రామకృష్ణంరాజు, తహసీల్దార్లు కె.రాజకిషోర్, డీటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకర్

సీఎస్‌డీటీగా బాధ్యతల స్వీకరణ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండల పౌర సరఫరాలశాఖ ఉప తహసీల్దార్‌గా అయితం వీర వెంకట సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటి వరకు పాలకొల్లు సీఎస్‌డీటీగా పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాగా ఇక్కడ సీఎస్‌డీటీగా పని చేసిన నాగదేవి పోడూరు మండలానికి బదిలీ అయ్యారు.

దోమల మందు పిచికారీ

స్పందనకు స్పందనం

పెనుగొండ, న్యూస్‌టుడే: కొఠాలపర్రులోని పలు వీధుల్లో దోమల తీవ్రత ఎక్కువగా ఉందన్న వైనంపై ఈ నెల 17న మేమున్నాం.. మీకు తోడుగా.. శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సర్పంచి జి.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో పలు ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

తుప్పలు శుభ్రం.. నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: మల్లవరం గ్రామ రక్షిత మంచినీటి పథకం చెరువుకు జిన్నూరు పంట కాలువ నుంచి నీటిని పంపింగ్ చేసే పంప్ హౌస్ చుట్టూ, తుప్పలు, డొంకలు పెరిగి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. సమస్యపై ఈ నెల 21న 'మేమున్నాం.. మీకు తోడుగా..' శీర్షికన ప్రచురించిన కథనానికి గ్రామ కార్యదర్శి గంగాధరరావు స్పందించారు. పంప్ హౌస్ చుట్టూ పెరిగిన తుప్పలను, సిబ్బందితో శుభ్రం చేయించారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యం


మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఉండి, న్యూస్‌టుడే: రుణ, రుణేతర కార్యకలాపాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా సహకార సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. ఉండిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల పాటు నిర్వహించే ధ్రువపత్ర కోర్సును ఆమె సోమవారం ప్రారంభించి మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే సేవలను సహకార సంఘాల ద్వారా అందించాలన్నారు. జిల్లాలో లైసెన్స్‌లు అవసరమైన 76 సహకార సంఘాల ప్రతినిధులకు ఉండి, వెంకట్రామన్నగూడెం, గరికిపాడు, నెల్లూరు, గుంటూరు కేవీకేల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఎన్.మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో మార్టేరు పరిశోధన స్థానం సహ సంచాలకుడు టి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు, జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు, డీసీవో కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న రాజు

వినతులన్నిటినీ పరిష్కరిస్తాం : ఆర్డీవో

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చిన వినతులను జాప్యం లేకుండా పరిష్కరిస్తామని ఆర్డీవో దాసి రాజు అన్నారు. నరసాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా వినతుల పరిష్కార వేదిక'(మీకోసం)లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పరిష్కారం నిమిత్తం ఆయా వినతిపత్రాలను సంబంధిత శాఖల అధికారులకు నివేదించాలని కార్యాలయ సిబ్బందిని ఆర్డీవో ఆదేశించారు. మొత్తం 25 మంది వినతులు అందించారని కార్యాలయ సిబ్బంది తెలిపారు. భూ సర్వే చేయించి సరిహద్దు సమస్య పరిష్కరించాలని కేపీపాలేనికి చెందిన పరికెల వెంకటరామకృష్ణ, లిఖితపూడికి చెందిన మల్లుల లక్ష్మీకాంతం వినతులు అందించారు. తమ భూమికి నిర్వహించిన రీసర్వేలో ఎల్పీ నంబర్ తప్పుగా నమోదు చేశారని పాలకొల్లు మండలం ఆగర్రుకు చెందిన గంధం వెంకటసత్యానాగేంద్ర వినతిపత్రం అందించారు. ఆయా వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆర్డీవో హామీ ఇచ్చారు.

మూడు అందాయి..

పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మూడు వినతులు అందాయని తహసీల్దార్ అనితాకుమారి తెలిపారు. పంచాయతీరాజ్ - రెండు, పెనుగొండ సీతారామునిపేటలో మద్యం దుకాణం తొలగించాలని మహిళలు వినతి అందించారని చెప్పారు.


అనితాకుమారికి వినతి అందిస్తున్న మహిళలు

కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

పెనుమంట్ర, న్యూస్‌టుడే: గ్రామాల్లో పనులు లేక ఇబ్బంది పడుతున్న కూలీలకు ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.సుబ్బరాజు కోరారు. పొలమూరు పంచాయతీ వద్ద సోమవారం ఉపాధి హామీ గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో పలు సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు అధికారులకు వినతి పత్రం అందజేశారు.

గోడు వింటారని.. పరిష్కరిస్తారని..

ప్రజావినతుల పరిష్కార వేదికలో అర్జీదారులు

నరసాపురం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ, మండల కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నా క్షేత్రస్థాయి అధికారులు వాటికి పరిష్కారం చూపడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి డివిజన్ అధికారి చొరవ చూపుతారని డివిజన్ స్థాయిలో నిర్వహించిన 'ప్రజావినతుల పరిష్కార వేదిక'కు వచ్చామని ప్రజలు చెబుతున్నారు.

భూమి లాగేసుకున్నారు



నాకు లిఖితపూడిలో భూమి ఉంది. దానిని నా మేనల్లుడు లాగేసుకుని నన్ను అక్కడకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాడు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఓపిక నాకు లేదు. బతికేందుకు ఆధారం లేదు. అధికారులు నా భూమి నాకు ఇప్పించాలి. **- మల్లుల లక్ష్మీకాంతం, ఎల్‌బీచర్ల**

న్యాయస్థానం తీర్పు ఇచ్చినా



మా కుల దేవత దేవారమ్మ ఆలయాన్ని పూర్వీకులు నిర్మించారు. ఈ ఆలయ నిర్వహణకు గ్రామంలోని ఒక వ్యక్తి అవరోధాలు కల్పిస్తున్నారు. దీనిపై న్యాయస్థానం కూడా మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయినా ఇబ్బందులు తొలగలేదు. న్యాయస్థానం తీర్పు అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. **- తిరుమాని ఆదికృష్ణ, యలమంచిలి**

మురుగు సమస్య తీర్చలేదు



మా పొరుగు వారి మురుగు నా ఇంటి ఆవరణ, గదుల్లోకి వస్తోంది. దీనిపై గతంలో పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశా. సమస్య పరిష్కరించలేదు. అందుకే డివిజన్ కార్యాలయానికి రావాల్సి వచ్చింది. **- పాలపర్తి శారదాబాయి, సరిపల్లి**

రూ.10.14 లక్షలకు టోకరా



ముంబయికి చెందిన ఒక సంస్థ తయారు చేస్తున్న ఆరోగ్య పానీయం 'ఓ ఆర్ ష్యూర్' స్టాక్ పాయింట్ ఇప్పిస్తామని దాని ఏజెంట్లు చెప్పిన మాటలు నమ్మి ఫిబ్రవరిలో ఆ సంస్థకు రూ.10.14 లక్షలు చెల్లించాం. అప్పటి నుంచీ స్టాక్ పాయింట్ ఇవ్వలేదు. కనీసం మా నగదు మాకు ఇప్పించమన్నా అదీ ఇవ్వలేదు. దీనిపై అధికారులు న్యాయం చేయాలి. **- పొనసానిపల్లి గిరి రాజ్యలక్ష్మీకుమారి, నరసాపురం**

పంచాయతీ చెరువు ఆక్రమణ



మా గ్రామ పంచాయతీకి కాలువ సమీపంలో చెరువు ఉంది. అది ఆక్రమణకు గురైంది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఆక్రమణదారుడికే మద్దతుగా నిలుస్తున్నారు. ఆ చెరువును అధికారులు స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించేలా చర్యలు చేపట్టాలి. **- ఎం.వీరసింహ, మల్లవరంలంక**

వివాహిత ఆత్మహత్య

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్‌లో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై సోమవారం కేసు నమోదు చేశామని ఎస్సై జి.వాసు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. లక్కవరపు అనూష(25)కు మాణిక్యాలరావుతో అయిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి 1, 2, 3 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మాణిక్యాలరావు ఇటీవల వ్యసనాలకు బానిసయ్యాడు. దీనిపై మనస్తాపం చెందిన అనూష ఈ నెల 19న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిపై ఆమె తల్లి తివారి అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నానాజీ మృతి తీరని లోటు

పెనుగొండ, న్యూస్‌టుడే: డీసీసీబీ మాజీ డైరెక్టర్, పెనుగొండ సహకార వ్యవసాయ పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు కూనపరెడ్డి లక్ష్మయ్యనాయుడు(నానాజీ) మృతి తీరని లోటని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు. సోమవారం నానాజీ స్వగృహంలో ఆయన పార్థివదేహానికి పూలమాలలతో నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ నానాజీ మృతి వైకాపాకు తీరని లోటని వివరించారు. కూనపరెడ్డి లక్ష్మయ్యనాయుడు(నానాజీ) మృతితో పెనుగొండ శోకసంద్రమైంది. హైదరాబాద్ నుంచి సోమవారం ఉదయం నానాజీ పార్థివదేహాన్ని పెనుగొండ తీసుకొచ్చారు. అభిమానులు, గ్రామస్థులు, పార్టీల కతీతంగా నాయకులు, కార్యకర్తలు, అంతిమయాత్రలో పాల్గొన్నారు. సంతాప సూచకంగా పెనుగొండలో వ్యాపార, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. నానాజీ మృతదేహానికి ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, వైకాపా జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, కొత్తపేట, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

అనుమతి లేని వ్యాపారంపై చర్యలు

యలమంచిలి, న్యూస్‌టుడే: మండలంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు ముందుగా అనుమతులు పొందాలని తహసీల్దార్ పవన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 24లోపు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లైసెన్సు లేకుండా దుకాణాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

రోడ్లపై నీళ్లతో ఇబ్బందులు

ఆచంట, న్యూస్‌టుడే: మూడు రోజులుగా ఆచంటలో ఒకే సమయానికి వర్షం పడుతోంది. సోమవారం మధ్యాహ్నం కూడా ఆచంట మండలంలో పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వీధుల్లో నీళ్లు నిలిచాయి. పారిశుద్ధ్య కార్మికుల ఇళ్ల వెనుక గాంధీ వీధిలో ఇటీవల వాహనాల రద్దీ పెరిగింది. ఈరోడ్డులో ఇటీవల ఇళ్ల స్థలాలకు సంబంధించి మూడు లేఅవుట్లు వేశారు. అనేక ద్విచక్రవాహనాలు ఈదారిలోనే తిరుగుతున్నాయి. సిమెంటు రోడ్డు ఒక వైపు దిగబడిపోవడంతో వర్షపు నీరు నిలిచి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆచంట మార్కెట్ నుంచి కచేరీ వరకూ దారిపొడవునా గోతుల్లో నీళ్లు నిలబడిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.


ఆచంట మహాత్మాగాంధీ వీధిలో వర్షపు నీరు

ప్రమాదకరంగా కల్వర్టు



పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ మినర్వా రహదారి నుంచి బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో డ్రెయిన్‌పై నిర్మించిన కల్వర్టు పెచ్చులు ఊడటంతో బాటసారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్తు, పశు వైద్యశాల, వ్యవసాయ తదితర కార్యాలయాలకు, బస్టాండ్‌కు వెళ్లేందుకు ఈ మార్గంలో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ డ్రెయిన్‌పై సిమెంటు ఫలకాలు వేయాలని గత దశాబ్దకాలంగా పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. తక్షణం మరమ్మతు చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకరరావుని సంప్రదించగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు.

నిర్లక్ష్యం వెలిగింది..!

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట - పాలకొల్లు మార్గంలో శ్మశానవాటిక దగ్గర ఉన్న విద్యుత్తు స్తంభంతోపాటు, వీధి దీపం కూడా పిచ్చిపాదులు పాకి, పూర్తిగా గూడులా అల్లుకుపోయాయి. వాటి మధ్య నుంచి ఈ విద్యుత్తు దీపం వెలుగుతోంది. సంబంధిత శాఖ నిర్లక్ష్యానికి నిలువెత్తు స్తంభంలా నిలబడింది.



పాలకొల్లులో పగటి వెలుగులు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లులోని 31 వార్డుల్లోనూ పలు ప్రాంతాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఫలితంగా విద్యుత్తు వృథా అవుతోంది. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి వాటిని మరమ్మతులు చేసిన కొద్ది కాలానికే మళ్లీ సమస్య తలెత్తుతోందని ఆవేదన చెందుతున్నారు.



పోలీసు అమరవీరులకు నివాళి

మొగల్తూరు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరులకు ఆ శాఖ అధికారులు సోమవారం ఘనంగా నివాళి అర్పించారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్తూపం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అక్కడ పుష్పాలు ఉంచి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నరసాపురం గ్రామీణ సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్సై జి.వాసు, ఏఎస్సై యు.రాజేంద్ర, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మొగల్తూరు: నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు


ఆచంటలో విద్యార్థుల ర్యాలీ

ఆచంట, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరులకు ఎంతో రుణపడి ఉన్నామని ఆచంట ఎస్సై కె.వెంకటరమణ అన్నారు. ఆచంటలో సోమవారం విద్యార్థులతో పోలీసు అమర వీరుల సంస్మరణ ర్యాలీ నిర్వహించారు.

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

క్లాప్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి



నిరసన తెలుపుతున్న నాయకులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: మున్సిపల్ క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు చెల్లించాలని సోమవారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. క్లాప్ డ్రైవర్లతో గత ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకోవడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎంటీపీవీ చిన్నా, కేశవరావు, సురేంద్ర పాల్గొన్నారు.

వాహనాలు అతి వేగంతో నడిపితే చర్యలు


పత్రాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ వంశీ

అత్తిలి(గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల నివాస ప్రాంతాల్లో వాహనాలు అతి వేగంతో నడిపితే చర్యలు తప్పవని అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ హెచ్చరించారు. సోమవారం అత్తిలి గ్రామంలో జనావాసాల మధ్య అధిక వేగంతో నడుపుతున్న వాహనాల చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చి, ధ్రువపత్రాలు పరిశీలించారు. అనంతరం గ్రామంలో మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాన్ని ఆర్డీవోతో కలిసి పరిశీలించారు. బాణసంచా అమ్మకాలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలని దుకాణదారులకు సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	:79950 67078
పెంటపాడు	:79939 36123
తణుకు గ్రామీణ	:85558 50851
అత్తిలి	:91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

సమస్య : తాడేపల్లిగూడెం పట్టణం యాగర్లపల్లిలోని ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి దోమలు వృద్ధి చెందడంతో స్థానికులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. **- రాంబాబు, స్థానికుడు**

సమాధానం : పరిశీలించి ఖాళీ స్థలాల్లో మురుగునీరు తొలగించేలా చర్యలు చేపడతాం. **- ఏసుబాబు, పురపాలక కమిషనర్**

సమస్య : తాడేపల్లిగూడెం పట్టణం పీఅండ్‌టీ కాలనీలోని టిడ్కో కల్యాణ మండపం రోడ్డులో చెత్త పేరుకుని రహదారిలోకి వస్తోంది. **- వెంకటేశ్, స్థానికుడు**

సమాధానం : రహదారిలో చెత్తను తొలగించేలా చర్యలు చేపడతాం. **- శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పెంటపాడు, న్యూస్‌టుడే

సమస్య : పెంటపాడు మండలం ముదునూరు శివారు అరుంధతీపేటలో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. చర్యలు తీసుకోవాలి. **- రాజేష్, స్థానికుడు**

సమాధానం : తాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం. **- భావన ధాన్యలక్ష్మి, సర్పంచి**

సమస్య : పెంటపాడు కనకసుందరరావు కాలనీలోని పలువీధుల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రి వేళలో అంధకారంగా ఉండి రాకపోకలు సాగిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- గాయత్రి, స్థానికురాలు**

సమాధానం : వీధి దీపాలకు మరమ్మతులు నిర్వహించి వెలిగేలా చేస్తాం. **- బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

ఖాళీ స్థలాలతో చిక్కులు

విజృంభిస్తున్న దోమలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే

తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలోని అన్ని వార్డుల్లో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. వీటిలో వర్షపు నీరు చేరి నిల్వ ఉంటోంది. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా యాగర్లపల్లి, కడకట్ల, టీచర్స్ కాలనీ, మహాలక్ష్మీనగర్, సవిత్రపేట, సుబ్బారావుపేట, బ్యాంకు కాలనీ, సత్యవతి నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. అవి మురుగుతో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఫలితంగా దోమలు వ్యాపించి పలు విషజ్వరాలు ప్రబలుతున్నాయి. గతంలో ఆయా ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించినా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. అధికారుల ఉదాసీనత కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వైద్యం నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు చెల్లించుకుంటున్నారు.


సుబ్బారావుపేట పురపాలకోన్నత పాఠశాల వద్ద ఇలా..

వీటితో ముప్పే

దోమల కారణంగా డెంగీ, మలేరియా తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. పగలు కుట్టే దోమల కారణంగా డెంగీ వస్తుంది. రెండు వారాలపాటు జీవించే ఈ దోమ నిల్వ ఉన్న నీటిలోనే గుడ్లు పెడుతుంది. ఇళ్ల పరిసరాల్లో నిల్వనీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గృహాల ఆవరణల్లోని పూల కుండీలు, టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు తదితర వాటిల్లో ఇవి గుడ్లు పెట్టే అవకాశాలు ఎక్కువ. వాటిలో నీటిని ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలి.

నివారణ చర్యలు ఏవీ

దోమల నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. అందుబాటులో ఉన్న నాలుగు ఫాగింగ్ పరికరాలు మూలన చేరడంతో వీధుల్లో తూతూమంత్రంగా మాత్రమే ఫాగింగ్ చేపడుతున్నారు. డ్రైనేజీల్లో దోమల మందు పిచికారీ చేయడం మచ్చుకైనా కానరావడం లేదు. ఖాళీ స్థలాల వ్యవహారంలో అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.


తితిదే కల్యాణ మండపం వద్ద పిచ్చిమొక్కలు

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం

ఖాళీ స్థలాల సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. దోమల నివారణ చర్యలు చేపడతాం. మెరుగైన పారిశుద్ధ్యానికి అందరి సహకారంతో కృషి చేస్తాం. - ఏసుబాబు, కమిషనర్

పట్టణ జనాభా	1.15 లక్షలు	వార్డులు	35	ఖాళీ స్థలాలు	1800	వారం రోజుల వ్యవధిలో నమోదైన జ్వరం కేసులు	322

వైభవంగా అన్నపూర్ణమ్మ గ్రామోత్సవం



పెంటపాడు, న్యూస్‌టుడే: పెంటపాడులోని ఒకటో వార్డులో కొలువైన కాశీఅన్నపూర్ణమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు పురస్కరించుకొని అమ్మవారి గ్రామోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, అర్చనలు, విశేషపూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై డప్పులు, డీజే వాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు.

కృష్ణుడి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పట్టింపాలెం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెంలో సోమవారం కృష్ణుడి ఆలయ నిర్మాణానికి శాసనసభ్యుడు బొలిశెట్టి శ్రీనివాస్ శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్డీయే నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి: సీపీఎం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: చేదోడు, ఆదరణ పథకాలు పునరుద్ధరించి చేతి వృత్తిదారులకు అమలు చేయాలని సీపీఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం వేల్పూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో దర్జీలు, రజక సంఘాల సభ్యులతో కలిసి స్థానిక తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు యండమూరి నాగేంద్ర, వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం నాయకులు నాగరాజు, వెంకటేశ్వరరావు, నాగేంద్ర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పశు సంతతితో రైతులకు అదనపు ఆదాయం

గణపవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పశువుల సంతతి పెంపొందించి రైతులకు అదనపు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పశుసంవర్ధక శాఖ సిబ్బందిని ఆదేశించారు. జల్లికొమ్మరలో రైతు భరోసా కేంద్రంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. పాడి పశువుల ఆరోగ్యంతో పాటు అవి క్రమం తప్పకుండా చూడి దాల్చినపుడు రైతుకు ఆదాయం సమకూరుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. 123 పశువులను వైద్య నిపుణులు పరీక్షించారు. రైతులకు మందులు పంపిణీ చేశారు.

సమగ్ర ప్రగతే ఎన్డీయే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

పెంటపాడు, న్యూస్‌టుడే : రాష్ట్రాభివృద్ధే ఎన్డీయే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన పెంటపాడు మండలం వల్లూరుపల్లి, పరిమెళ్ల గ్రామాల్లో జరిగిన పల్లెపండగ, భూముల రీసర్వే గ్రామసభల్లో పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా అయిదేళ్ల అరాచక పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమన్నారు. అన్నివర్గాల ప్రజలు, యువత, రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా అధికారం చేపట్టిన ఎన్డీయే ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. రాబోయే రోజుల్లో అభివృద్ధిలో తాడేపల్లిగూడేన్ని రాష్ట్రంలోనే తొలివరుసలో నిలబెట్టేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, సర్పంచులు దంగేటి రామారావు, గొర్రెల కోటేశ్వరరావు, నాయకులు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పుల్లా బాబీ, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, అడబాల నారాయణమూర్తి, హరనాథ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌ఛార్జి డీఎల్పీఓ బాలాజీ వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట


ప్రదర్శనలో నాయకులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పెద్ద పీట వేసిందని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా సాయిబాబు పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రాధాకృష్ణ ఆదేశాల మేరకు సోమవారం ఇరగవరం మండలం రేలంగిలో గ్రామ సర్పంచి స్వరాజ్యం ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.22 లక్షలతో డ్రెయినేజీ, రూ.2.30 లక్షలతో మినీ గోకులాల షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎన్డీయే నాయకులు మానే భాస్కరరావు, పి అబ్బులు, రాంబాబు, శ్రీను, నాగరాజు, ఏడుకొండలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సృజనకు పదును

'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకులోని భాష్యం ఆంగ్లమాధ్యమ పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమం ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పదో తరగతికి చెందిన జీఎస్ఎస్ మౌనిషా, ఎనిమిదో తరగతికి చెందిన కె.మౌనమి అశ్విని ప్రియ, తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.నిత్యశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ ఎ.శ్రీమన్నారాయణ, వైస్ ప్రిన్సిపల్ పాండురంగారావు, ఉపాధ్యాయులు బి.శేఖర్, ఈ.శ్రీలలిత, హెచ్‌వోడి టి.సత్యనారాయణ బహుమతులు అందజేశారు.


తణుకు: బహుమతులు అందుకున్న విజేతలతో పాండురంగారావు, ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని ఆంగ్లో ఇండియన్ పాఠశాలలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'చరవాణి వినియోగం వల్ల లాభనష్టాలు, మీకు ఎదురైన అనుభవాలు?' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జి. కావ్యశ్రీ, రూపేష్, కె.ప్రవీణ్ కుమార్‌లకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాకేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం: విజేతలతో ప్రిన్సిపల్ రాకేష్, ఉపాధ్యాయులు

ఆధునికీకరించారు.. ఆపడం మరిచారు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి రైల్వేస్టేషన్లో అసౌకర్యాలు మేట వేశాయి. మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్తిలి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ లేకపోవడంతో అత్తిలి మండల పరిధిలోని 35 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం దూర ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులు, వైద్య సదుపాయం కోసం తిరిగే రోగులు, ఉద్యోగులు ఎక్స్‌ప్రెస్‌లు ఆగకపోవడంతో రోడ్డు మార్గం ద్వారా 25 కి.మీ ప్రయాణించి, తణుకు లేదా భీమవరం వెళ్లాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్టేషన్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని వాపోయారు. రైల్వే స్టేషన్లో ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ ఇవ్వాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


అత్తిలి రైల్వే స్టేషన్


సైకిల్ షెడ్డు దుస్థితి

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిగా తీసుకోండి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజ భద్రత, రక్షణే ధ్యేయంగా విధి నిర్వహణలో ఎందరో పోలీసులు అమరులయ్యారని వారి నిబద్ధత, క్రమశిక్షణను స్ఫూర్తిగా తీసుకోవాలని పట్టణ సీఐ కొండయ్య కోరారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా తణుకు నరేంద్ర కూడలి వద్ద పట్టణ పోలీసులు అమర వీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు చంద్రశేఖర్, శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు. ★ తణుకు గ్రామీణ ఎస్సై ఏజీఎస్ మూర్తి ఆధ్వర్యంలో గ్రామీణ పోలీస్‌స్టేషన్ నుంచి పైడిపర్రు కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ★ ఇరగవరం ఎస్సై జానా సతీష్ ఆధ్వర్యంలో ఇరగవరంలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు.


ఇరగవరం: ప్రదర్శనలో ఎస్సై జానా సతీష్, సిబ్బంది



తణుకు: నివాళులర్పిస్తున్న పట్టణ పోలీసులు

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం


సిబ్బందితో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ రమేష్ కిశోర్

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఆస్పత్రిలో చేరిన గర్భిణికి సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆరోగ్య శాఖ సంయుక్త కమిషనర్ రమేష్ కిశోర్ స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రిని సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి మంచంపై ప్రసవించిన బాలింతను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అన్ని వార్డులను సందర్శించి లోటుపాట్లను గుర్తించారు. వాటిని తక్షణం పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగికి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వారితో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

బాలింతను విచారించిన మానవ హక్కుల సంఘం.. తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రిలో మానవ హక్కుల సంఘం సభ్యులు సోమవారం ఉదయం విచారణ చేపట్టారు. బాలింతని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇతర రోగుల వద్ద నుంచి సమాచారం సేకరించారు. మానవ హక్కుల సంఘం సభ్యులు బిందు చౌదరి, మురళీ కృష్ణ, అభిషేక్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం స్వీకరిస్తున్న కమిషనర్ ఏసుబాబు

మీకోసంలో ఆరు దరఖాస్తులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ ఏసుబాబు అన్నారు. స్థానిక పురపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మొత్తం ఆరు ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో పారిశుద్ధ్యానికి సంబంధించినవి అయిదు ఉన్నాయని వివరించారు. వాటిని తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మేనేజరు సుధాకర్, తెదేపా పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ


సమావేశంలో మాట్లాడుతున్న హరీష్

మాధవరం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తాడేపల్లిగూడెం ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి మందలపర్తి హరీష్ అన్నారు. సోమవారం మాధవరం గణపతి సెంటర్లో గోదావరి గ్రామీణ భవన నిర్మాణ కార్మిక సంఘ నూతన అధ్యక్షుడు గంధం సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భవన కార్మికులకు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి పి.ఆదినారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, ఏఐటీయూసీ కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడారు.

అవినీతి రహిత సమాజం కోసం పాటుపడాలి


బహుమతులు అందుకున్న విద్యార్థులతో బ్యాంక్ అధికారులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: అవినీతి రహిత సమాజాన్ని నెలకొల్పేందుకు విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ విజిలెన్స్ ఇన్‌ఛార్జి రాంబాబు సూచించారు. బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఇరగవరం మండలం ఏలేటిపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవినీతి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతి నిర్మూలన అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ మేనేజర్ శ్రీదేవి, విజిలెన్స్ అధికారి విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, శాఖ మేనేజర్ కెఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి ప్రధాన రహదారులపై కూడళ్ల వద్ద చెత్త వేయకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టింది. ప్రజలకు అవగాహన కలిగేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఇంటి పరిసరాలు, రహదారులు, ప్రభుత్వ ప్రాంగణాలలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. రహదారులపై వేసిన చెత్తను పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో సిబ్బంది శుభ్రం చేశారు.

అధ్యాపకులకు కార్యశాల


మాట్లాడుతున్న కాదంబరి

పెదతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: 5జీకి మించి కృత్రిమ మేధ ఆధారిత యాంటెనాల తయారీలో వీ2వీ అప్లికేషన్స్‌దే కీలకపాత్ర అని నిట్ వరంగల్ సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ కేవీ కాదంబరి అన్నారు. పెదతాడేపల్లి వాసవి ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డు(సెర్బ్) సహకారంతో అధ్యాపకులకు నిర్వహిస్తున్న అయిదు రోజుల కార్యశాలను సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాదంబరితోపాటు ఏపీనిట్ ఎలక్ట్రానిక్స్ విభాగపు అధిపతి యువరాజ్ తదితరులు పలు అంశాల్ని వివరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపల్ రత్నాకరరావు, టెక్నికల్ డైరెక్టర్ చుక్కా అప్పారావు, రీసెర్చ్ డీన్ వీఎస్ నరేష్, కార్యశాల సమన్వయకర్త వి.కుసుమ కుమారి తదితరులు ప్రసంగించారు.

పాఠశాలలు, వసతి గృహాల సందర్శన

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకులోని ప్రాథమిక పాఠశాలలు, బాలుర వసతి గృహాలను సోమవారం సబ్ యూనిట్ అధికారి జి వెంకటేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా వంటశాల, మరుగుదొడ్లు, తాగునీరు సౌకర్యాలను పరిశీలించారు. దోమ తెరలు ఏర్పాటు చేసి, స్వచ్ఛమైన తాగునీరు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేఖర్, కాంచనమాల, ఫైలేరియా యూనిట్ పర్యవేక్షకుడు కె సత్యనారాయణ, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అడ్డుకోవడమే కాదు, వాటిని పూర్తి స్థాయిలో నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కమిషనర్ ఏసుబాబు అన్నారు. స్థానిక పురపాలక కార్యాలయంలో బాల్య వివాహాల నిరోధంపై మండల స్థాయి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ దుర్గభవాని, కె. విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

పట్టింపులేని పాలశీతలీకరణ కేంద్రాలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:

పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పాల శీతలీకరణ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రం ఇరగవరం, తణుకు మండలం మండపాక గ్రామాల్లో డీఆర్‌డీఏ, ఐకేపీ, పశుసంవర్ధక శాఖ, ఏపీడీడీసీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో 2012లో సుమారు రూ.9 లక్షల చొప్పున నిధులతో గోదావరి మిల్క్ గ్రిడ్ ప్రాజెక్ట్ పాల శీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో పాడి పరిశ్రమల ద్వారా రైతులు, డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వ లక్ష్యం. ఇరగవరం కేంద్రాన్ని మాత్రం మొదట్లో బాగా నిర్వహించినా క్రమేపి మూత పడింది. మండపాక కేంద్రానికి యంత్రాలు తెచ్చి ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ప్రారంభించ లేదు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు, కొనుగోలు చేసిన విలువైన యంత్రాలు, పరికరాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.


ఇరగవరంలో నిరుపయోగంగా..


మండపాకలో మూలకు చేరిన పరికరాలు

ఇదీ పరిస్థితి

తణుకు నియోజకవర్గంలో మొత్తం పాడి పశువులు సుమారు 23,555 ఉండగా అందులో పాలు ఇచ్చేవి 18 వేలు పైగా ఉంటాయి. రోజూ 90 వేల లీటర్ల వరకు పాలు ఉత్పత్తి అయ్యే అవకాశముంది. పాడి రైతులు ప్రైవేటు పాల కేంద్రాల వద్ద తక్కువ ధరకు పాలను విక్రయించి నష్టపోకుండా.. వెన్న శాతాన్ని బట్టి గిట్టుబాటు ధర చెల్లించేందుకు వీటిని ఏర్పాటు చేశారు. ఇవి అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేట్ పాలకేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్ని కేంద్రాల్లో నిర్వాహకులు వెన్న శాతం (పాల పేట) తగ్గిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం 1 శాతం ఫ్యాట్‌కు రూ.7 ఇస్తున్నారు. దీంతో పది రావల్సిన వెన్న శాతం 7, 8 మధ్యలో వస్తుందని వాపోతున్నారు. ★ ప్రస్తుతం పాలశీతలీకరణ కేంద్రాలపై ఎటువంటి ప్రతిపాదనలు లేవని తణుకు ఏపీఎం రామకృష్ణ తెలిపారు.

పరిమెళ్లలో అగ్నిప్రమాదం

రూ.4 లక్షల ఆస్తి నష్టం

పెంటపాడు, న్యూస్‌టుడే : పెంటపాడు మండలం పరిమెళ్లలోని ఓ రెండు వాటాల భవనంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక అధికారి జీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని గొర్రెల పెద అప్పారావుకు చెందిన భవనంలోని ఒక వాటాలో బలె కిశోర్ కుటుంబం అద్దెకు ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. కొద్దిపాటి వ్యవధిలోనే ఇల్లంతా వ్యాపించడంతో స్థానికులు తాడేపల్లిగూడెం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. అప్పటికే ఇంటిలోని అన్నిరకాల వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంలో రూ.4 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అధికారుల అంచనా.